ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
సోమవారం 28 ఏప్రిల్ 2025




రోడ్డునే రాసిచ్చేశారు..!



రాయచోటిలోని ఎన్జీవో కాలనీలో రోడ్డుపైనే నిర్మిస్తున్న ఇల్లు

రోజూ వేలాది మంది తిరుగుతూ.. రద్దీగా ఉండే రోడ్డును మీ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకుంటున్నారా? ఆ రోడ్డు పైన ఇల్లు కట్టుకోవాలని కలలు కంటున్నారా? ఇందుకోసం మీరు ఎటువంటి అగచాట్లు పడాల్సిన పని లేదు. ఎవరెవరినో సంప్రదించాల్సిన అవసరం లేదు. సరాసరి రాయచోటికి వచ్చేస్తే చాలు.. నిబంధనల ఊసు లేకుండా.. మీరు కోరుకున్న రోడ్డును రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. ఆ రోడ్డుపైనే ఇల్లు కూడా కట్టుకుని కలలు సాకారం చేసుకోవచ్చు. ఈ బాధ్యతంతా రిజిస్ట్రేషన్ శాఖ, మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ శాఖలు దగ్గరుండీ చూసుకుంటాయి.



- జనసమ్మర్ద రోడ్డు అక్రమ రిజిస్ట్రేషన్..
- ఆపై టౌన్‌ప్లానింగ్ అనుమతి
- జోరుగా అక్రమ నిర్మాణం.. పట్టించుకోని టౌన్‌ప్లానింగ్
- రిజిస్ట్రేషన్, మునిసిపాలిటీ శాఖల అవినీతికి పరాకాష్ఠ

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలో చాలా వరకు వీధులు ఇరుకుగా ఉంటాయి. అయితే 1991లో ఏపీ ఎన్జీవో హౌస్ బిల్డింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఎన్జీవో కాలనీ (ప్రభుత్వ రికార్డుల ప్రకారం రిజిస్టర్ కాలేదు) ఏర్పాటైంది. అప్పటి వరకు పట్టణంలో 12 అడుగులు, 15 అడుగుల రోడ్లు ఎక్కువగా ఉండేవి. ఎక్కడో ఒకటిరెండు చోట్ల వీధుల్లో.. కొత్తగా వేసే లేఅవుట్లలో 20 అడుగుల రోడ్లు ఉండేవి. అయితే ఎన్జీవో కాలనీ ఏర్పాటుతో మొదటిసారిగా 40 అడుగుల రోడ్లను రాయచోటి ప్రజలు చూశారు. దీంతో ఇక్కడ ఇంటి స్థలాలకు సైతం గిరాకీ ఏర్పడింది. ఇక్కడ పెద్ద పెద్ద భవంతులు నిర్మించుకున్నారు. ఈ కాలనీలో రాయచోటి మునిసిపాలిటీ కోట్లాది రూపాయలు ఖర్చు చేసి సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించింది.. ఈ రోడ్లన్నీ మునిసిపాలిటీకి చెందినవిగానే ప్రజలు వినియోగించుకుంటూ ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ వ్యక్తి 2020లో ఈ ఎన్జీవో కాలనీలో ఓ ప్లాటు కొనుగోలు చేయాలనుకున్నాడు. ప్లాట్లు ఖాళీగా లేకపోవడం.. ఇతరులు అమ్మకపోవడంతో.. సాధ్యం కాలేదు. అయితే అతను ఎలాగైనా సరే అనే నిర్ణయం తీసుకోవడంతో.. అక్రమమార్గానికి తెరలేసింది.

అక్రమానికి రిజిస్ట్రేషన్ శాఖ వత్తాసు

మామూలుగా ఆ కాలనీ ప్రభుత్వ రికార్డుల్లో రిజిస్టర్ కాకపోయినా సరే.. ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఉపయోగించుకుంటున్న.. మునిసిపాలిటీ కోట్ల రూపాయలు ఖర్చు చేసి వేసిన రోడ్డుపైన ఏపీ ఎన్జీవో హౌసింగ్ బిల్డింగ్ సొసైటీకి ఎటువంటి అధికారమూ ఉండదు అయితే రాయచోటి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సహకారంతో ఆ కాలనీలో ఓ ముఖ్యమైన 40 అడుగుల రోడ్డులో 18 అడుగులు అతనికి అమ్మడానికి అప్పటి ఏపీ ఎన్జీవో హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ పాలకవర్గం అక్రమ నిర్ణయం తీసుకుంది. దీనికి ఏపీ ఎన్జీవోస్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ డెవలప్‌మెంట్ ఖర్చు కోసం డబ్బు అవసరమై అనే ముసుగును



వాడారు. (ఎన్నో సంవత్సరాల కిందట ఏర్పడిన కాలనీ.. ప్రస్తుతం ఆ కాలనీలో అభివృద్ధి పనులను మునిసిపాలిటీ చేస్తున్న నేపథ్యంలో.. ఇక్కడ ఆ సొసైటీ ఏం అభివృద్ధి చేస్తుందో మరి.. పై వాళ్లకే తెలియాలి) ఈ మేరకు వాస్తవాలను కప్పిపెట్టి.. రోడ్డును ఖాళీ స్థలంగా చూపిస్తూ ఆ స్థలాన్ని ఇదే ఏపీ ఎన్జీవోస్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీలో సభ్యుడైన చిననరసింహులుకు అప్పటి ఈ సొసైటీ అధ్యక్షుడు జయచంద్ర రూ.3,50,000లకు 28-12-2020 (డాక్యుమెంటు నెంబరు 2403/2021) అమ్మేశాడు. ఈరోజు నుంచి నా వారసులకు, నా స్థానంలో వచ్చే ఏపీ ఎన్జీవో హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్షులకు గానీ, ఎలాంటి సంబంధం లేదు. అని నా సమ్మతిన ఏపీ ఎన్జీవో రాయచోటి తాలూకా హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ ప్రెసిడెంట్ హోదాలో విక్రయిస్తున్నట్లు డాక్యుమెంటులో రాశారు. గతంలో ఆ లేఅవుట్‌లో లేని కొత్త నెంబరును ఆ స్థలానికి కేటాయించారు. ఇది ఏ విధంగా చెల్లుబాటు అవుతుందో.? లేఅవుట్‌లో రోడ్డుగా ప్రజలు ఉపయోగించుకుంటున్న స్థలాన్ని ఖాళీ స్థలంగా ఎలా రిజిస్ట్రేషన్ చేశారో? చేసిన వాళ్లకే తెలియాలి. దీని వెనుక లక్షలాది రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు ఉన్నాయి. కాబట్టే.. కనీసం లింకు డాక్యుమెంట్లు లేకపోయినా.. కేవలం ఏపీ ఎన్జీవోస్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ తీర్మానం ఆధారంగా రిజిస్ట్రేషన్ చేశారు. సదరు చిననరసింహులు తన పేరు మీద రిజిస్టర్ అయిన రోడ్డును.. అదేరోజు (డాక్యుమెంటు నెంబరు 2404/2021) పొట్టిరెడ్డి అనే వ్యక్తికి అమ్మేశారు.

టౌన్‌ప్లానింగ్ తక్కువేమీ తినలేదు

ఎద్దు ఈనింది అంటే.. గాటిన కట్టేయమనే తీరుగా.. రోడ్డును నిబంధనలకు విరుద్ధంగా రిజిస్ట్రేషన్ శాఖ రిజిస్ట్రేషన్ చేసి తమ నిజాయతీని నిరూపించుకుంటే.. ఆ రోడ్డుపైన ఇల్లు కట్టుకోవడానికి రాయచోటి మునిసిపాలిటీ టౌన్ ప్లానింగ్ శాఖ అది రోడ్డా..? స్థలమా? అని చూడకుండా.. 2022లో అనుమతులు ఇచ్చేసింది. దీనిని బట్టే.. రాయచోటి మునిసిపాలిటీలోని టౌన్ ప్లానింగ్ శాఖలో ఎంత నిజాయతీగా పనులు జరుగుతున్నాయో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. టౌన్‌ప్లానింగ్ అనుమతులు ఇవ్వడంతో.. గత కొన్ని రోజులుగా రోడ్డుపైన ఇంటి నిర్మాణం జోరుగా సాగుతోంది. అయినా టౌన్‌ప్లానింగ్ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. అసలు ఆ పని తమది కాదన్నట్లు మిన్నకుంటున్నారు. దీనిపైన పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎక్కడో ఊరికి దూరంగా.. కొండల్లో.. గుట్టల్లో దారులు ఆక్రమించుకున్నారంటే.. ఏమో అనుకోవచ్చు.. రోజూ ప్రజలు తిరిగే రోడ్డును అక్రమంగా రిజిస్టర్ చేయడం, దానికి టౌన్‌ప్లానింగ్ వాళ్లు ఇల్లు కట్టుకోవడానికి అనుమతులు ఇవ్వడం దారుణమని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి.. ఈ రోడ్డు అక్రమ రిజిస్ట్రేషన్, అక్రమ ఇంటి నిర్మాణంపైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఇంటి నిర్మాణంపై చర్యలు తీసుకుంటాం

- లక్ష్మీనారాయణమ్మ, టౌన్‌ప్లానింగ్ అధికారి

రిజిస్ట్రేషన్ జరిగిన స్థలంలో ఇంటి నిర్మాణం జరుగుతున్నది వాస్తవమే.. నిబంధనలకు విరుద్ధంగా టౌన్‌ప్లానింగ్ అనుమతులు ఇచ్చారని కొందరు ఫిర్యాదు చేశారు. దీనిపైన చర్యలు తీసుకుంటాం. ఇల్లు నిర్మిస్తున్న వారికి నోటీసులు ఇచ్చాము. ఇటీవలే ఇక్కడ ఇంటి స్థలం మినహాయించి రోడ్డు, డ్రైనేజి నిర్మించారు. అప్పుడే ఎవరైనా అడ్డుచెప్పి ఉంటే.. ఇంత వరకు సమస్య వచ్చేది కాదు..

సంతానలక్ష్మికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

గుర్రంకొండ, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సంతానలక్ష్మీగా పేరుగాంచిన రెడ్డెమ్మ కొండ ఆలయంలో ఆదివారం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయాన్నే ఆలయంలో అర్చన, పంచామృతాభిషేకం, విశేష పూజలు చేశారు. అనంతరం ఉత్సవ మూర్తులను పరిమళభరిత పూలతో అలంకరించి విశేషపూజలు చేశారు. సంతానం లేని దంపతులు వివిధ ప్రాంతాల నుంచి వచ్చి అమ్మవారి వద్ద ఒరపడి మొకమ్కులు తీర్చుకున్నారు. భక్తుల కొబ్బరికాయలను సమర్పించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో ఈవో మంజుల, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హత ఉన్న పాడి రైతులకు గోకులాలు

- గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులే లక్ష్యం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



సిమెంటు రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

సంబేపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హత ఉన్న ప్రతి పాడి రైతుకు గోకులాన్ని అందిస్తామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఆదివారం నాగిరెడ్డిగారిపల్లె పంచాయతీలో రూ.27.60 లక్షలతో నిర్మించిన 12 గోకులాలను 17 లక్షలతో నిర్మించిన రెండు సిమెంటు రోడ్లను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సిమెంటు రోడ్లు, వీధిలైట్లు, మౌలిక వసతులు కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాడి రైతులకు అధిక ప్రాధాన్యతను ఇచ్చి ప్రతి గ్రామానికి మినీ గోకులాలు మంజూరు చేయడం సంతోషంగా ఉందన్నారు. సంబేపల్లె మండలంలోని నాగిరెడ్డిగారి పల్లెకు 12 మినీగోకులాలు మంజూరు చేసి పూర్తి చేయడం జరిగిందన్నారు. పాడి రైతులకు మినీ గోకులాలు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. నాగిరెడ్డిగారి పల్లె పంచాయతీలో రూ.17 లక్షలతో నిర్మించిన సిమెంటు రోడ్లను మంత్రి ప్రారంభించారు. నాగిరెడ్డిగరి పల్లె గ్రామ పంచాయతీలో ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన మంత్రికి యువగళం సిద్దారెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. స్థానికంగా ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఆయన అక్కడికక్కడే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు. పోతువాండ్లపల్లెలో ఎర్రగుడి రాంమోహన్‌రెడ్డి ఆహ్వానం మేరకు ఆయన ఇచ్చిన విందుకు హాజరయ్యారు. కార్యక్రమంలో నితిన్ మౌర్యరెడ్డి, మాజీ జడ్పీటీసీ సభ్యుడు మల్లు నరసారెడ్డి, భయ్యారెడ్డి, శేఖర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, వెంకటేశ్వర్‌నాయుడు, మహదేవరెడ్డి, నాగార్జుననాయుడు, మాజీ మండల ఉపాధ్యక్షుడు నాగరంజన్‌వల్లి, బాబయ్య, ఆలంసాహెబ్, సంతోశ్, చంద్రబాబునాయుడు, రాజశేఖర్‌నాయుడు, పలువురు టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

డబ్ల్యూఎస్‌డబ్ల్యూసీఎఫ్ ఫైనల్స్‌లో గుండ్లూరు యువకుడు





పోటీల్లో ప్రదర్శనలిస్తున్న మహమ్మద్ అర్షద్, మహమ్మద్ అర్షద్ (ఫైల్)

పీలేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ స్ట్రీట్ వర్కవుట్స్ అండ్ క్యాలిస్థనిక్స్ ఫెడరేషన్ ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో కలికిరి మండలం గుండ్లూరుకు చెందిన యువకుడు తన సత్తా చాటాడు. ఎటువంటి జిమ్ పరికరాల సాయం లేకుండా కేవలం తమ శరీర బరువుతో శరీర సౌష్టవాన్ని పెంపొందించుకునే క్రీడ క్యాలిస్థనిక్స్. ఆ క్రీడలో ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు బల్గేరియా దేశంలోని సోఫియాలో ప్రపంచ క్యాలిస్థనిక్స్ పోటీలు జరుగుతున్నాయి. ఈ పోటీల్లో బెంగళూరులో స్థిరపడిన గుండ్లూరు నివాసి ముస్తాక్ అహ్మద్ కుమారుడు అయిన షేక్ మహమ్మద్ అర్షద్ ఆదివారం రాత్రి జరగనున్న ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. సుమారు 50 దేశాల క్రీడాకారులు పోటీపడుతున్న ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో మన దేశం తరపున ప్రాతినిధ్యం వహిస్తున్న అర్షద్ ఫైనల్స్‌కు చేరుకోవడంతో ఈ విషయం ఆదివారం సాయంత్రం గుండ్లూరులో చర్చనీయాంశమైంది. బీటెక్ వరకు చదువుకుని బెంగళూరులోని ప్రముఖ బహుళజాతి సంస్థ రేజర్ గ్రూప్‌లో డేటా సైంటిస్టుగా పనిచేస్తున్న అర్షద్ చిన్నతనం నుంచి బాడీ బిల్డింగ్‌పై ఆసక్తి పెంచుకున్నాడు. తల్లిదండ్రులు, స్నేహితుల ప్రోత్సాహంతో అనేక దేశవాళీ పోటీల్లో రాణించాడు. అందులో భాగంగా ఇటీవల జరిగిన జాతీయ పోటీల్లో చాంపియన్‌గా నిలవడంతో దేశం తరపున బల్గేరియాకు వెళ్లే అవకాశం దక్కించుకున్నాడు. అతను ఫైనల్స్‌కు చేరుకోవడం పట్ల అతడి తండ్రి, అనేక మంది గుండ్లూరు వాసులు హర్షాతిరేకాలు వ్యక్తం చేశాడు. అర్షద్ తప్పకుండా ప్రపంచ చాంపియన్‌గా నిలుస్తాడని వారు ధీమా వ్యక్తం చేశారు.

వీరభద్రాలయంలో అమావాస్య పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

రాయచోటిటౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో ఆదివారం అమావాస్య సందర్భంగా స్వామి, అమ్మవార్ల పల్లకీ ఉత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో డీవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాముల వేదమంత్రాల మధ్య ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి పల్లకీ ఉత్సవంపై ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బ్యాండు మేళాలు, కోలాటాల మధ్య భద్రకాళీ సమేత వీరభద్రుడి పల్లకీ ఉత్సవాన్ని ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. పల్లకీ ఉత్సవం సందర్భంగా పట్టణ భక్తులతో పాటు కన్నడ భక్తులు వీరభద్రుడిని, భద్రకాళీ అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా అమావాస్య పల్లకీ ఉత్సవం విశిష్టత గురించి అర్చకులు భక్తులకు వివరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పహల్గాం మృతులకు నివాళులు

- ఎమ్మెల్యే ఆధ్వర్యంలో క్యాండిల్ ర్యాలీ



మదనపల్లెలో క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లోని పవల్గాం వద్ద ఉగ్రవాదుల దాడుల్లో అశువులు బాసిన పర్యాటకుల ఆత్మలు శాంతించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం రాత్రి స్థానిక బెంగళూరు బస్టాండు నుంచి టౌన్‌బ్యాంకు సర్కిల్ వరకు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదుల దాడులను పార్టీలకతీతంగా ప్రతిఒక్కరూ ఖండించాలన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంకు చైర్మన్ విద్యాసాగర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు. దేశ సమగ్రతను దెబ్బతీసే కుట్రలను తిప్పికొడతామని పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి ఆర్‌జే వెంకటేశ్ తెలిపారు. ఆదివారం స్థానిక నిమ్మనపల్లె సర్కిల్ వద్ద టీడీపీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆర్‌జే మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు గండికోట గణేష్, మధుబాబు, పూలమురళి, ఒంటికొండ వెంకటేశ్, రాజన్న తదితరులు పాల్గొన్నారు.



క్యాండిల్ ర్యాలీలో భారీ సంఖ్యలో పాల్గొన్న టీడీపీ నాయకులు

భగవంతుడా.... మరీ ఇంత ఘోరమా...!

- ఇద్దరు బిడ్డలు...తండ్రికి ఒకేసారి అంత్యక్రియలు
- బాలిక మృతదేహాన్ని కర్ణాటకకు తీసుకెళ్లిన కుటుంబీకులు
- తీవ్ర విషాదం నింపిన దారుణ ఘటన
- నలుగురి మృతితో తల్లడిల్లిన ములకలచెరువు



పోస్టుమార్టం అనంతరం ములకలచెరువుకు తీసుకొచ్చిన మల్లేశ్, లావణ్య, నందకిషోర్ మృతదేహాలు

ములకలచెరువు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): దేవుడా... మరీ ఇంత ఘోరమా...ఒకే సారి నలుగురిని తీసుకెళ్లిపోయావా...ఇద్దరు బిడ్డలతో సహా తండ్రిని...మరో బాలికను బలి తీసుకున్నావా...దేవుడా కొంచైనా కనికరం కలగలేదా అంటూ ములకలచెరువు కంట నీరు పెట్టుకుంది. ములకలచెరువు వాసులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తీవ్ర ఆవేదన చెందారు. ములకలచెరువు సమీపంలోని పాత ములకలచెరువు పెద్దచెరువులో మునిగి నలుగురు మృతి చెందిన విషయం విదితమే. ఈ ఘటనలో ములకలచెరువు సమీపంలోని దండువారిపల్లె ప్రభుత్వ లేవుట్‌లో నివాసమున్న ఒకే కుటుంబానికి చెందిన కనికరం మల్లేష్ (35), కుమార్తె లావణ్య (12), కుమారుడు నందకిషోర్ (11), మరో బాలిక నందిత (13) చెరువులో మునిగి ప్రాణాలు వదిలారు. పెద్దచెరువు గట్టున దుస్తులు ఉతుకుతున్న మల్లేష్ భార్య ఈశ్వరమ్మ కళ్లేదుటే భర్త, ఇద్దరు బిడ్డలు, మరో బాలిక గల్లంతయ్యారు. జనసంచారం లేని ప్రాంతం కావడంతో ఈశ్వరమ్మ పరుగెత్తుకుంటూ వెళ్లి చుట్టుపక్కల వెతికినా ఎవరూ కల్పించలేదు. చివరికి నివాసమున్న లేఅవుట్ దగ్గరకు వెళ్లి స్థానికులకు విషయం చెప్పింది. ఇంతలోనే జరగాల్సిన నష్టం జరిగిపోయి మొత్తం కుటుంబాన్ని పోగొట్టుకుంది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మల్లేశ్, ఈశ్వరమ్మలకు ముగ్గురు సంతానం. పెద్ద కుమార్తె ఇందు, చిన్న కుమార్తె లావణ్య, కుమారుడు నందకిషోర్‌లు ఉన్నారు. పెద్ద కుమార్తె ఇందు ఇంటి వద్దే ఉండగా మల్లేశ్, ఈశ్వరమ్మ, లావణ్య, నందకిషోర్‌లు పెద్ద చెరువు వద్దకు వెళ్లారు. ఈశ్వరమ్మ బట్టలు ఉతుకుతుండగా చెరువులో మునిగి మల్లేశ్, రెండవ కుమార్తె లావణ్య, కుమారుడు నందకిషోర్ మృతి చెందారు. కాగా పెద్దచెరువులో మునిగి మృతి చెందిన నలుగురి మృతదేహాలకు మదనపల్లె ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. మదనపల్లె జిల్లా ఆస్పత్రిలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, యువ నేత కట్టా దొరస్వామినాయుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త మంత్రి గిరిధర్‌రెడ్డి, నియోజకవర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జనార్ధన్‌రెడ్డి, విశ్వనాధరెడ్డి తదితరులు వేర్వేరుగా మృతుల కుటుంబీకులను పరామర్శించారు. పోస్టుమార్టం అనంతరం మల్లేశ్, అతడి కుమార్తె లావణ్య, కుమారుడు నందకిషోర్ మృతదేహాలను అంత్యక్రియల నిమిత్తం ములకలచెరువు సమీపంలోని లేఅవుట్‌కు తీసుకొచ్చారు. అలాగే బాలిక నందిత మృతదేహాన్ని కర్ణాటక రాష్ట్రం బొమ్మశెట్టిహళ్లికి తరలించారు. మల్లేశ్, అతడి ఇద్దరు బిడ్డలను ఒకేసారి, ఒకేచోట పక్కపక్కనే అంత్యక్రియలు నిర్వహించడంతో చేసిన స్థానికులు తల్లడిల్లిపోయారు. అయ్యో పాపమంటూ కన్నీరు పెట్టుకున్నారు. మల్లేశ్ కుమార్తె లావణ్య స్థానిక జడ్పీ హైస్కూల్‌లో 9వ తరగతి, కుమారుడు నందకిషోర్ 7వ తరగతి చదువుతున్నారు. దీంతో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు వచ్చి శోకసంద్రంలో మునిగిపోయారు.

నన్నూ...తీసుకెళ్లిపో దేవుడా

కుటుంబంలో భర్తను, ఇద్దరు పిల్లలను తీసుకెళ్లిపోయావు...నన్ను ఎందుకు వదిలేశావు దేవుడా....భర్త, ఇద్దరు పిల్లలూ లేరు...నన్నూ తీసుకెళ్లిపో అంటూ ఈశ్వరమ్మ భోరున విలపించింది. కొద్దిసేపటి ముందు కళ్లముందే ఉన్న భర్త, ఆడుకుంటున్న ఇద్దరు పిల్లలు క్షణాల వ్యవధిలో చెరువులో మృత్యువాత పడడంతో పాపం ఈశ్వరమ్మ తల్లడిల్లిపోయింది. భర్త మల్లేశ్, ఇద్దరి బిడ్డలు లావణ్య, నందకిషోర్ మృతదేహాలను చూసి గుండెలు పగిలేలా రోదించింది. ఆమె రోదన చూసిన ప్రతి ఒక్కరూ కంటనీరు పెట్టుకున్నారు.



కుటుంబంలో ముగ్గురు మృతి చెందడంతో రోదిస్తున్న ఈశ్వరమ్మను ఓదార్చుతున్న బంధువులు

బావిలో పడ్డ జింక

● రక్షించిన ఫారెస్టు అధికారులు

కడప క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కుక్కలు తరుముకుంటూ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిన జింకను ఆదివారం ఫారెస్టు అధికారులు రక్షించారు. మామిళ్లపల్లె బీట్ కొన్నేపల్లి పంచాయతీ సమీపంలో రెండు సంవత్సరాల వయస్సు గల జింకను కుక్కలు తరుముకుంటూ రావడంతో 100అడుగుల లోతు బావిలో పడింది. సమాచారం అందుకున్న మామిళ్ల పల్లె సెక్షన్ సిబ్బంది గ్రామస్థుల సాయంతో జింకను రక్షించారు. అనంతరం జిల్లా వెటర్నరీ ఏడీ హాస్పిటల్‌లో జింకకు వైద్య పరీక్షలు నిర్వహించి మామిళ్లపల్లె రిజర్వు ఫారెస్టులో వదలిపెట్టారు. ఈ ఆపరేషన్‌లో కడప ఎఫ్‌ఆర్‌వో కె.ప్రసాద్, మామిళ్లపల్లె సెక్షన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆసుపత్రుల సూపరింటెండెంట్లను, వైద్య కళాశాలలకు నూతన ప్రిన్సిపాళ్లను నియమించింది. ఇందులో భాగంగా ఒంగోలులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జమునను కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఇక్కడి ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖను నంద్యాల జీజీహెచ్‌కు బదిలీ చేశారు.

నిరుపయోగంగా రైతుబజారు

● రూ.1.50 కోట్ల ప్రజాధనం వృధా

● వ్యాపారులకు కొరవడిన వసతులు

● స్టాల్స్ పెట్టుకునేందుకు ఆసక్తి చూపని వైనం

వాణిజ్య సముదాయంలో తెరుచుకోని గదులు





నిరుపయోగంగా ఉన్న రైతుబజారు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారింది. చిన్న రైతులు పండించిన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తే గిట్టుబాటు ధర ఉంటుందని భావించి గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌యార్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. కూరగాయల షెడ్లతో పాటు వాణిజ్య సముదాయం నిర్మించారు. ఈ రైతు బజారును 2024 జనవరి 17వతేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ఇక్కడ కూరగాయల విక్రయాలు జరిగాయి. ఆ తరువాత ఒక్కరు కూడా ఈ రైతు బజారు వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిరుపయోగంగా మారింది. కానీ మున్సిపల్ అధికారులు పట్టణంలోని రంగనాయకుల గుడి కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని పెద్ద కూరగాయల అంగళ్లు మాత్రం పట్టణంలోని రంగనాయకుల స్వామి గుడి సమీపంలోని మార్కెట్‌లో వారపు సంత నిర్వహిస్తున్నారు. అలాగే బస్టాండు సర్కిల్‌లో చిరు వ్యాపారస్తులు ఇప్పటికీ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పాత మార్కెట్లో మాత్రం అధికారులు రాజకీయ వత్తిళ్ల కారణంగా తొలగించలేదు. అదే విధంగా పట్టణంలో ప్రధాన రహదారులలో రోడ్డు వైపు స్థలాలు ఆక్రమించుకుని కొందరు కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నవారిని కూడా అధికారులు తొలగించలేదు. దీంతో ప్రస్తుతం వారపు సంత జరిగే ప్రాంతంలో వ్యాపారులు లేక ప్రజలు రాక చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూరగాయల విక్రయాలు పూర్తిగా వారపుసంత జరిగే ప్రదేశంలోకి తరలించడంతో పాటు లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రైతు బజారులో రైతులు కూరగాయల విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ప్రణాళికలు లేకుండా రైతు బజారు నిర్మించడంతో ఇక్కడికి మారేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టు తీసుకున్న వైసీపీ నాయకులు నిధుల విషయంలో చూపిన ఆసక్తి నిర్మాణంలో చూపడంలేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో మార్కెట్ సముదాయంతో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకు పనికిరావన్నది అర్థమవుతోంది. దీంతో పట్టణంలోని పాత రంగనాథస్వామి మార్కెట్లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన మార్కెట్ లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు ఇక్కడికి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారం లేకపోతే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బజారును పూర్తిగా వినియోగంలోకి తెచ్చి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

కేజీపీజీ సెట్‌కు విశేష స్పందన



కేజీసెట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసి పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలనుకునే వారికోసం నిర్వహించిన కేజీపీజీ2కె25కు విశేష స్పందన వచ్చిందని, కడప, చిత్తూరు జిల్లాల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్లు కేఎస్‌ఆర్ఎం కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ స్టడీస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి తెలిపారు. ఏపీ ప్రభుత్వం నిర్వహించే ఐసెట్ తరహాలో ఈ పరీక్ష నిర్వహించామని, టాప్‌ర్యాంకు సాధించినవారికి ఉచిత అడ్మిషన్ కల్పిస్తామని అన్నారు. కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది మార్గదర్శకాలను, సలహాలను తీసుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడాలని, పటిష్ఠ ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, కేఎల్ఎం ప్రిన్సిపాల్ రత్నమ్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు



పోటీలకు ఎంపికైనవిద్యార్థులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ బాలురు, బాలికల విభాగంలో 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు సీఎస్ఎస్‌ఆర్ అండ్ ఎస్‌ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ పోటీల కోసం వైవీయూ తరపున ఎంపిక ప్రక్రియ నిర్వహించారని, ఇందులో తమ కళాశాల విద్యార్థులు సలావుద్దీన్, చిన్నిక్రిష్ణ, శేషాద్రి, సోయల్, షాబుద్దీన్, రుచిత, ఆలియా సుల్తానా, సైదా ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 30 నుండి మే 8వ తేదీ వరకు నెల్లూరులో జరిగే ఆలిండియా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.

పుష్పగిరి గిరిప్రదక్షిణపై అపోహలు వద్దు

● ఈవో శ్రీనివాసులు

వల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి గిరిప్రదక్షిణపై వస్తున్న అపోహలను నమ్మవద్దని ఈవో కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పుష్పగిరి లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద జరిగే గిరిప్రదక్షిణపై కొన్ని స్థానిక పత్రికలు, వాట్సాప్ గ్రూపుల్లో రకరకాలుగా వార్తలు వస్తున్నాయని, భక్తులు వాటిని నమ్మరాదని ఆయన తెలిపారు. ఈ గిరిప్రదక్షిణ యధావిధిగా జరుపుతామని, ఇందులో భక్తులు, ధార్మిక సంఘాలు, హిందూబంధువులు అనుమానపడవలసిన అవసరం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మంచినీటి సౌకర్యం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

జలాశయంలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

మైలవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో ఈతకు వెళ్లి వేముల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం (53) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. పులివెందుల నియోజకవర్గం వేముల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, తన సోదరుడు వారివారి కుటుంబాలతో కలిసి మండలంలోని గైబుషావలి దర్గాను సందర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో మైలవరం జలాశయం వద్దకు వచ్చి సహసోదరుడితో కలిసి తక్కువ లోతు ఉన్న ప్రదేశంలో ఈతకు దిగారు. అనంతరం ఒడ్డుకు తిరిగి వస్తుండగా జలాశయంలోని గుంతలో జారిపడి నీటిలో మునిగాడు. వెంటనే మైలవరం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో జలాశయంలో షేక్ ఇబ్రహీం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య షేక్ రహిమూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులేసు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ద్విచక్రవాహనంపై నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.మండలంలోని తోట్లపల్లె వీఆర్వో కాలనీకి చెందిన ఆరవేటి ఓబులేసు (52) మధ్యాహ్న సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడి మృతి చెందినట్లు అతని కుమారులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు ఓబులేసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓంకారేశ్వరరావు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కడప- రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓంకారేశ్వరరావు (38) అనే ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకుడు మృతి చెందాడు. కడప నగరం అక్కాయపల్లెలో నివాసం ఉండే ఓంకారేశ్వరరావు రామాపురంలోని మోడల్ స్కూల్‌లో విధులు నిర్వహించేవాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం రాయచోటికి వెళ్లి తిరిగి వస్తుండగా గువ్వల చెరువు ఘాట్ రెండో మలుపు వద్ద రాయచోటివైపు నుండి కడపకు వస్తున్న టమోటా మినీ లారీ టైరు పంక్చర్ అయి అదుపు తప్పి పక్కనే ఉన్న ఓంకారేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓంకారేశ్వరరావు టమోటా లారీ కింద పడటంతో మరణించాడు. విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థలం విషయమై తల్లీకొడుకుపై దాడి

● తీవ్ర గాయాలతో స్పృహ తప్పిన తల్లి

చెన్నూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన పంగా శసింద్రి (49)తో పాటు ఆమె కుమారుడు పంగా ఈశ్వరయ్యలపై ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన పంగా సుబ్బరాయుడు, మరో ముగ్గురు కలిసి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఉప్పరపల్లెకు చెందిన పంగా వెంకటసుబ్బయ్య, పంగా సుబ్బరాయుడు అన్నదమ్ములు. వీరికి గ్రామంలో ఉన్న పదిసెంట్ల స్థలం విషయమై ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వెంకటసుబ్బయ్య భార్య పంగా శసింద్రి, ఆమె కుమారుడు పంగా ఈశ్వరయ్య, కోడలు సుధావాణి ఇంటి వద్ద ఉన్నారు. నాగసానిపల్లెలో ఉండే పంగా సుబ్బయుడు తన బంధువులైన పంగా వెంకటసుబ్బయ్య, చౌడయ్య, సిద్దం సుబ్బరాయుడు మద్యం తాగి వచ్చి అసభ్యకరంగా దూషిస్తూ ఇంటి వద్ద ఉన్న వీరిపై దాడి చేశారు. ఈ దాడిలో రాడ్లు, కర్రలు ఉపయోగించడంతో శశింద్రి, ఈశ్వరయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. కాగా శసింద్రికి తలపై బలమైన గాయం కావడంతో స్పృహ తప్పి పడిపోయింది. గాయపడిన వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై పంగా వెంకటససుబ్బయ్య స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకూతురిపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తల్లీకూతురిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, కొత్తపల్లె పంచాయతీ, వడ్డిపల్లెకు చెందిన టి. సునీత (38) శ్రావణి (17)పై అదే గ్రామానికి చెందిన నలుగురు మహిళలు, నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చారు. దీంతో గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ఇంట్లోకి ఎందుకు తొంగి చూస్తున్నారని యువకులను అడిగినందుకు ఎనిమిది మంది ఇంట్లో దూరి దాడి చేసి గాయపర్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాలూకా సీఐ తెలిపారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):తేనెటీగల దాడిలో కురబలకోట మండలం, ఎర్రబోయనపల్లెకు చెందిన మాధవి (40) పెద్దన్న (46) గాయపడి ఆదివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. బాధితుల తెలిపిన వివరాల మేరకు పొలం వద్ద పనులు చేసుకొంటుండగా పొలంలోని చెట్టు నుంచి తేనేటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరు గాయపడినట్లు తెలిపారు.

అరటి రైతులను ఆదుకోవాలి : తులసిరెడ్డి

వేంపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అరటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీసీసీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి డిమాండ్ చేశారు. వేంపల్లెలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో 1,44,987ఎకరాలలో రైతులు అరటిపంట వేశారన్నారు. కడప, అనంతపురం, నంద్యాల, తూర్పుగోదావరి, కోనసీమ, పార్వతీపురం తదితర జిల్లాలో అరటి పంట వేశారన్నారు. ఎకరాకు దాదాపు రూ. 2లక్షలు పెట్టుబడి అవుతుందని, టన్నుకు రూ.10వేలు ధర పలికితే అసలు వస్తుందన్నారు. సింగపూర్, మలేషియా, ఇండోనేషియా తదితర దేశాలకు ఎగుమతి నిలిచిన కారణంగా ధర అమాంతం పడిపోయిందన్నారు. టన్నుకు రూ.5వేలకు కూడా కొనడం లేదన్నారు. రైతు లకు ఎకరాకు రూ.లక్ష నష్టం వస్తోందన్నారు. ధరల స్థిరీకరణ నిధి ద్వారా రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే గోకులం బిల్లులు వెంటనే చెల్లించాలన్నారు.

30న పాలీసెట్ ప్రవేశ పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ పరీక్ష ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. ఈ పరీక్ష కోసం 4,135 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికోసం పల్లవోలులోని సీబీఐటీ కళాశాల, లింగాపురంలోని ఎస్‌ఆర్‌ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, కొర్రపాడు రోడ్డులోని వైఎస్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు, రెండు ఫోటోలు, బాల్‌పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్లతో పరీక్షకు హాజరుకావాలన్నారు. మొబైల్స్, కాల్కులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమన్నారు.

దొంగల హల్‌చల్



కురబలకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట జడ్పీహైస్కూల్ పక్కన ఉన్న ఇంట్లో దొంగలు హల్‌చల్ చేశారు. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోట సమీపంలోని హైస్కూల్ సమీపంలోని మస్తాన్ ఇంట్లోకి చొరబడి చోరీకి పాల్పడటంతో కలకలం రేగింది. కాగా మస్తాన్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న దాదాపుగా 900గ్రాముల బంగారం, నగదును దోచుకెళ్ళారు. కాగా ఇంటి వెనుక వైపున ఉన్న ఫ్యాన్ రెక్కలను కట్ చేసి ఇంటిలోకి ప్రవేశించారు. అందులో విలువైన వస్తువులను తీసుకెళ్ళారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన ఆయన దొంగతనం జరిగిందని గమనించి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవలి : భూపేశ్‌రెడ్డి



టోర్నమెంటులో విన్నర్స్‌కి ట్రోఫీ, బహుమతిని అందిస్తున్న భూపేశ్‌రెడ్డి

ఎర్రగుంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): క్రీడాకారులు గెలుపోటములను సమానంగా తీసుకుని క్రీడాస్ఫూర్తితో ముందుకెళ్లాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. ఎర్రగుంట్ల మండలం వైకోడూరులో మాజీ సర్పంచి సిరిగిరెడ్డి సునంద జ్ఞాపకార్థం కోడూ రు ప్రీమియర్ లీగ్ పేరుతో నెలరోజులుగా రాష్ట్ర స్థాయి క్రికెట్ టోర్న మెంటు నిర్వహించారు. ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో తాడిపత్రి విజేతగా నిలిచింది. ప్రథమ బహుమతి రూ.1.50లక్షలతో పాటు ట్రోఫీని, రన్నర్‌గా నిలిచిన కడప డీఎస్సీ జట్టుకు రూ.75వేలను ట్రోఫీ ని ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌డీఏ కూటమి ఇన్‌చార్జి మధుసూధన్‌రెడ్డి, మాజీ సర్పంచి సిరిగిరెడ్డి శివారెడ్డి, బీజేపీ నాయ కుడు జంగంరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అక్కదేవతల తిరునాళ్లు



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో వెలసిన ముగ్గురు అక్కదేవతల తిరునాళ్లు ఆదివారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా మూడు రోజులుగా ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లాకు చెందిన ఎడ్లు 1251 అడుగులు లాగి రూ.లక్ష ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి. టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంబటి క్రిష్ణారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నిన్న విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల జమ్ముకాశ్మీర్ ఉగ్రవాద దాడి విషయంగా విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఇంటర్నల్ టెర్రరిజం, మత విద్వేశాలను పోషిస్తున్నది బీజేపీనే అని మాట్లాడడం, ప్రధానమంత్రి మోదీపై అనుచిత వాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయంగా షర్మిలాపై వన్‌టౌన్ ఎస్ఐకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, జర్మనీరాజు, పిల్లస్వామి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



షర్మిలపై వన్‌టౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు జ్యోతిరావు పూలే పురస్కారాలు

పీలేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురిని మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ పురస్కారాలు వరించాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన తంత్ర జ్యోతిష్కులు చింతా రుగ్మాంగద రావు, పీలేరుకు చెందిన కళాకారుడు షేక్ ఖాదర్ బాషా, పీలేరుకు చెందిన తెలుగు భాషా సమితి అధ్యక్షుడు, కవి, రచయిత జలకనూరి మురళీధర్ రాజు, పీలేరు మండలం రేగళ్లుకు చెందిన సామాజిక సేవా కార్యకర్త యలిచెలమల షామీర్ మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ పురస్కారాలు అందుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలోని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఈ పురస్కారాలు అందజేసింది. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ 134వ జయంతి, కడపకు చెందిన ట్రాన్స్‌జెండర్, సామాజిక సేవా కార్యకర్త డా.షేక్ సమీరా ప్రథమ వర్ధంతి సందర్భంగా అభిలాష సంస్థ విభిన్న రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందజేసింది. రాజమండ్రిలోని ఆనం రోటరీ క్లబ్ హాలులో ఆదివారం రాత్రి పురస్కారాలు ప్రదానం చేశారు.



పురస్కారాలు అందుకున్న రుక్మాంగద రావు, ఖాదర్ బాషా, జలకనూరి మురళీధర్ రాజు, షామీర్

అడవిలో మంటలను అదుపుచేసిన అటవీ సిబ్బంది



సిద్దవటం బీట్‌లో ఎగిసిపడుతున్న మంటలను అదుపు చేస్తున్న అటవీ సిబ్బంది

సిద్దవటం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): సిద్దవటం ఫారెస్ట్ రేంజి పరిధిలోని సిద్దవటం, మద్దూరు అటవీబీట్‌లో శనివారం రాత్రి అడవికి ఆకతాయిలు నిప్పు పెట్టడంతో ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి ఆధ్వర్యంలో సిబ్బందితో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఆదివారం సిద్దవటం అటవీశాఖ కార్యాలయంలో కళావతి మాట్లాడుతూ ఆకతాయిలు నిప్పు పెట్టడంతో కొండ ప్రాంతంలో మంటలు ఎగిసిపడుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బంది అప్రమత్తమై మంటలను వాటర్ పంపులు, చెట్లకొమ్మలు, బ్లోయర్స్ ఉపయోగించి అదుపులోకి తీసుకువచ్చారన్నారు. వన్యప్రాణుల సంరక్షణకు అటవీ ప్రాంతం పచ్చదనంతో ఉండేటట్లు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. కొండకు నిప్పు పెట్టడం వన్యప్రాణులు అంతరించిపోయే ప్రమాదం ఉందని, వన్యప్రాణుల సంరక్షణ ప్రతిఒక్కరు బాధ్యత వహించాలన్నారు. డిప్యూటీ రేంజర్ ఓబులేశు, సెక్షన్ ఆఫీసర్ సురేష్‌బాబు, ఎఫ్‌బీవోలు పెంచలరెడ్డి, దీపిక, మధు, ఆది విశ్వనాథ్ పాల్గొన్నారు.

'దళిత మిత్ర కమిటీ రద్దు'

సంబేపల్లె, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కైపు రామాంజనేయులు ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా దళిత మిత్ర సం కమిటీ రద్దు చేసినట్లు ఏపీ దళిత మిత్ర సంఘ రాష్ట్ర అధికార ప్రతినిధి పెడబల్లి నాగభూషణం ఆదివారం తెలిపారు. దళిత మిత్ర సంఘం పేరుతో ఎవరైనా సంఘంలో ఉన్నామని గానీ, సంఘం పేరు చెప్పి గానీ అధికారులు, మరెవరి వద్దకైనా వెళ్లి సంఘం పేరు చెబితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా కమిటీని ప్రకటించేంతవరకు ఎవరూ సంఘం పేరు చెప్పకూడదని ఆయన పేర్కొన్నారు.

జాతరకు హాజరైన కస్తూరి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఓబులవారిపల్లె పంచాయతీకి చెందిన బలిజపల్లె గ్రామ టీడీపీ నాయకుల ఆహ్వానం మేరకు గంగమ్మ జాతరకు హాజరైనట్లు రైల్వేకోడూరు నియోజకవర్గం టీడీపీ మాజీ ఇన్‌చార్జి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కస్తూరి విశ్వనాథనాయుడు తెలిపారు. మండలంలోని కటికంవారిపల్లె, బలిజపల్లె గ్రామం టీడీపీ సీనియర్ నాయకుడు బండి క్రిష్ణయ్య ఆహ్వానం మేరకు అక్కడికి వెళ్లినట్లు తెలిపారు.

గంగమ్మ సేవలో ముక్కా సాయివికాస్‌రెడ్డి

ఓబులవారిపల్లె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) :ఓబులవారిపల్లె పంచాయతీ బలిజపల్లె గ్రామంలో నిర్వహించిన జాతరలో టీడీపీ ఇన్‌చార్జి రూపానంద రెడ్డి కుమారుడు సాయివికాస్‌రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ గునిపాటి చెంద్రాయుడు, అడపాల బాలాజీ, భరత్, చరణ్, కిరణ్ తదితర టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

కొండలు, గుట్టలు, చెరువులు తవ్వేస్తున్నారు

● గ్రావెల్ ఎర్రమట్టికి భలే గిరాకీ ● వెలుతురు ఉండగానే ఇల్లు చక్కబెట్టుకునే వైనం ● పట్టించుకోని రెవెన్యూ అధికారులు







దొర్రిచెరువు వద్ద ఉన్న కొండను తవ్విన దృశ్యం.. బాలిరెడ్డిగారిపల్లె వద్ద కొండను తవ్వి మట్టిని తవ్విన అక్రమార్కులు.. ట్రాక్టర్‌తో మట్టిని తరలిస్తున్న దృశ్యం

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్27 (ఆంధ్రజ్యోతి): అక్రమార్కులు లక్కిరెడ్డిపల్లె మండలంలోని కొండలు, గుట్టలు, చెరువులు ఎక్కడ పడితే అక్కడ ఇష్టానుసారంగా గ్రావెల్ ఎర్రమట్టిని తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో అడిగే వారు లేకపోవడంతో ఇష్టానుసారంగా కొండలు పిండి చేసి గ్రావెల్ ఎర్రమట్టిని తరలించారు. ఇప్పుడు కూడా అదే తంతు కొనసాగుతోంది. ఎక్కడ చూసినా కొండలు, గుట్టలు, చెరువులు ఇష్టానుసారంగా తవ్వి ట్రాక్టర్ వెయ్యి రూపాలతో అమ్మి సం పాదిస్తున్నారు. లక్కిరెడ్డిపల్లె దొర్రిచెరువు పక్కన ఉన్న కొండను పూర్తి స్థాయిలో తవ్వేశారు. తవ్విన గ్రావెల్‌ను రాయచోటి, రామాపురం ఇతర ప్రాంతాలకు ట్రాక్టర్ వెయ్యి రూపాయలతో విక్రయిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అడిగే వారు లేకపోవడంతో కొండలను పిండి చేసి గ్రావెల్ అమ్ముకున్నారు. పాలెంగొల్లపల్లి, కోనంపేట, దప్పేపల్లె, లక్కిరెడ్డిపల్లె, మామిడిగారిపల్లె ప్రాంతాల్లో కొండలు ఎక్కువగా తవ్వేశారు. రాయచోటి జిల్లా ఏర్పడినప్పటి నుంచి కొన్ని వేల ట్రాక్టర్లు ఎర్రమట్టిని తరలించారు. ప్రస్తుతం కూడా అదే విధంగా పరిస్థితి ఉంది. ప్రతి గ్రామంలోనూ రెవెన్యూ అధికారులు, వీఆర్‌వోలు ఉన్నా ఏమి లాభం లేదని ఆయా గ్రామాల నుంచి విమర్శలు గుప్పిస్తున్నారు. ఏది ఏమైనా రెవెన్యూ అధికారులు వీటిపైన ప్రత్యేక దృష్టి పెట్టాలని గ్రామస్థులు కోరుతున్నారు. అంతేగాకుండా కొండలన్నీ తవ్వి భూములను తయారు చేసి వాటికి పట్టాదారు పాసుపుస్తకాలు పుట్టిస్తున్నారు. రెవెన్యూ అధికారులు కొండలు, గుట్టలు, చెరువులను కాపాడాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని ప్రజలు కోరుతున్నారు.

దళితుల భూముల జోలికొస్తే సహించం : ఎమ్మార్పీఎస్

సుండుపల్లె, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): దళితుల భూముల జోలికి వస్తే సహించేది లేదని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్ తెలిపారు. ఆదివారం మండలంలోని మడితాడు గ్రామ పంచాయతీకి చెందిన కొంతమంది సర్వే నెంబర్ 1192/ఏ1లో ఉన్న ప్రభుత్వ భూమి కబ్జా చేశారన్నారు. సుమారు 30 సంవత్సరాల నుంచి దళితుల అనుభవంలో ఉన్న భూమిని కొంత మంది అగ్రవర్ణాలకు చెందిన వారు కబ్జా చేశారన్నారు. అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేశ్, జిల్లా యువజన అధ్యక్షులు అశోక్‌కుమార్, కృష్ణయ్య, ఎంఆర్‌పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

కాంక్రీట్‌లో లిక్విడ్ వినియోగంపై అవగాహన

రాయచోటిటౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రఖ్యాతి గల ఫార్ములాతో స్ట్రేజీలో ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో మారుమూల గ్రామాల్లోనూ ఆధునాతన టెక్నాలజీని అందిస్తోందని మాస్టర్ ట్రైనర్ కాంక్రీట్‌లో లిక్విడ్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఆదివారం రాత్రి గున్నికుంట్ల రోడ్డులో మేస్త్రీలు, బేల్దారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యం

● గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు ● రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మంచినీటి బోరును ప్రారంభిస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, ఆయన సతీమణి హరిత

చిన్నమండెం, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. చిన్నమండెం మండలం బోనమల కస్బా ప్రజల కోరిక మేరకు ఆ గ్రామంలో శాశ్వత నీటి సమస్యకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలంలో పర్యటించిన మంత్రికి బోనమల గ్రామ ప్రజలు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. అక్కడ మంచి నీటి బోరును మంత్రి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రి సతీమణి హరిత కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బోనమల గ్రామ ప్రజల కోరిక మేరకు గ్రామానికి శాశ్వత నీటి సమస్య పరిష్కరించి గ్రామంలో కావాల్సిన అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేస్తామని వారికి హామీ ఇచ్చారు. దీంతో బోనమల గ్రామ ప్రజలు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్ర బాబు నాయుడు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి పేదరికం లేని సమాజాన్ని నిర్మించేందుకు విశేష కృషి చేస్తున్నారని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం చిన్నమండెం మండలం బోరెడ్డిగారి పల్లెలోని తమ నివాసంలో మంత్రి మండి పల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సం దర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో పేదలకు సంక్షేమ పథకాలు అందక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొనే వారని, కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత నిజమైన పేదలను గుర్తించి వారందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామన్నారు. త్వరలో అర్హులకు నూతన పింఛన్లు, ఇళ్ల మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వం అందించే పథకాలను పేదలందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. నలుమూలల నుంచి వచ్చిన ప్రజల అర్జీలను మంత్రి స్వీకరించి సంబంధిత అధికారులకు ఫోన్‌చేసి వాటిని పరిష్కరించారు.

24 మందికి కంటి ఆపరేషన్లు

రాయచోటిటౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లెలో గల లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 24 మందికి కంటి ఆపరేషన్లు నిర్వహించారు.రాయచోటి నియోజకవర్గంతో పాటు రాజంపేట, పీలేరు నియోజకవర్గంలోని యర్రావారిపాలెం, కేవీపల్లి, కలికిరి, కలకడ, గుర్రంకొండ, కదిరి, పెద్దమండెం, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 50 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన వారిలో అర్హులైన 24 మందికి ఆపరేషన్లు చేశారు. అలాగే గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మందికి ఉచితంగా మందులు, అద్దాలు పంపిణీ చేశారు.కంటి ఆసుపత్రి చైర్మన్ వైవీఆర్ స్వరూపగుప్త, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ లయన్ చెన్నూరు అన్వర్‌బాషా, మాజీ సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, కంటి వైద్యులు సురేష్‌బాబు, భార్గవి, ఆప్తాల్మిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

దాతల సహకారంతోనే అభాగ్యులకు మానవత అండ

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): దాతల సహకారంతోనే నిరుపేదలకు, అభాగ్యులకు, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సహకారం అందిస్తోందని కేంద్ర కమిటీ చైర్మన్ ప్రసాద్‌యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక నలంద హైస్కూల్‌లో మానవత ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధి వైస్ చైర్మన్‌గా నియమితులైన కొండూరు వెంకటరామరాజును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మానవతా సేవా సంస్థ ద్వారా ఈ ఏడాది పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన నిరుపేద విద్యార్థులకు సంస్థ ద్వారా నగదు బహుమతులు అందిస్తామన్నారు. మానవతా మండల అధ్యక్షుడు డాక్టర్ షఫీనాయక్, చైర్మన్ బాలసుబ్రమణ్యం, కో చైర్మన్ శివశంకర్‌రెడ్డి, మానవతా సభ్యులు శివయ్య, రవిశంకర్, తెలుగు యువత మండల అధ్యక్షుడు పక్కీరయ్య, రామాంజనేయులు, సాయిచరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ సిటీ నూతన సీఈవోకు అభినందనలు

నందలూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ సైన్స్ సిటీ నూతన సీఈవోగా ఎంపికైన రాజంపేటవాసి వెంకటేశ్వర్లు చౌదరికి అభినందనలని రాజంపేట అగ్రికల్చర్ మార్కెట్‌కమిటీ మాజీ చైర్మన్, రాష్ట్ర తెదేపా పరిశీలకుడు యెద్దల విజయసాగర్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడిన వ్యక్తికి తగిన గుర్తింపు లభించడం ఆనందదాయకమన్నారు. అనంతరం సీఈవోను శాలువతో ఘనంగా సత్కరించారు.

హెల్మెట్ తప్పనిసరి : సీఐ

సిద్దవటం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కడప - చెన్నై జాతీయ రహదారి భాకరాపేట చెక్‌పోస్టు వద్ద ఆదివారం ఒంటిమిట్ట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బాబు వాహనాలను విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు.

మే 6న సీతా జయంతి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : స్థానిక కోదండరామాలయంలో మే 6న సీతాజయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. కావున భక్తులు సీతా జయంతి కార్యక్రమంలో పాల్గొని కోదండరామస్వామి కృపకు పాత్రులు కావాలని తెలిపారు.

భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

రాజంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట భువనగిరిపల్లె లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రతియేడాది అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బ్రహ్మోత్సవాల పోస్టర్, లగ్నపత్రికలను పసుపులేటి బ్రహ్మయ్య కుమారుడు వీరప్రదీప్‌కుమార్, ఆలయ ధర్మకర్తలు చేతులమీదుగా ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మే 10 నుంచి 14 వరకు బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామన్నారు. 13న జరిగే కల్యాణ మహోత్సవానికి రాజంపేటలోని నలుమూలల నుంచి వచ్చే భక్తులకు అన్ని రకాల సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు.

మోదీ నాయకత్వంలో అగ్రరాజ్యంగా భారత్

పుల్లంపేట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో భారతదేశం అగ్రరాజ్యంగా వెలుగొందుతుందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేష్‌నాయుడు పేర్కొన్నారు. ఆదివారం మండల పరిధిలోని గొల్లవారిపల్లెలో బీజేపీ సీనియర్ నాయకులు వెంకటేశ్ ఆధ్వర్యంలో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ సందర్భంగా రమేష్‌నాయుడు మాట్లాడుతూ వికసిత్ భారత్ కార్యక్రమంలో అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. మండల పార్టీ అధ్యక్షులు మనోహర్‌రెడ్డి, శ్రీనివాసులు, కిరణ్, శివ, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పంతగాని అభిమానుల అన్నదానం

రైల్వేకోడూరు రూరల్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధ్యక్షుడు పంతగాని నరసింహ ప్రసాద్ 23వ వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయన అభిమానులు ఆదివారం పట్టణంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి టోల్‌గేటు వద్ద ఉన్న చర్చి కాంపౌండ్ ఆవరణలో పేదలకు అన్నదానం చేశారు. పం తగాని దంపతులకు గజమాలతో సన్మానించారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

రాజంపేట టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : కార్మికులను కట్టు బానిసలుగా మార్చే నాలుగు రకాల లేబర్ కోడ్‌లను రద్దు చేసి పాత చట్టాలనే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సి.రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఎన్జీవో కార్యాలయ సమీపంలో చట్టాలపై పుస్తకం విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ పాత చట్టాలను తీసుకురాకుంటే మే 20న సమ్మె నిర్వహిస్తామన్నారు.

అటవీ జంతువుల నీటివసతికి ప్రత్యేక ఏర్పాట్లు





గొల్లపల్లె అటవీ బీట్‌లో వన్యప్రాణులకు తాగునీటి ఏర్పాట్లు.. మద్దూర్ ఫారెస్ట్ బీట్‌లో తాగునీరు ఏర్పాటు చేస్తున్న దృశ్యం

● ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి

సిద్దవటం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అటవీ జంతువుల నీటివసతికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు సిద్దవటం ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి పేర్కొన్నారు. అధిక వేసవిని దృష్టిలో పెట్టుకుని ఫారెస్ట్ రేంజ్ పరిధిలోని గొల్లపల్లె, మద్దూర్, కొండూరు, సిద్దవటం, ముత్తుకూరు, అటవీ బీట్‌లలో వన్యప్రాణులకు తాగునీటి కోసం దాదాపు 25 సాసర్ తొట్టెల్లో తాగునీరు నింపామన్నారు. సిద్దవటం ఫారెస్ట్ రేంజ్ కార్యాలయంలో ఆదివారం కళావతి మాట్లాడుతూ అధిక ఉష్ణోగ్రతను దృష్టిలో పెట్టుకుని వన్యప్రాణుల తాగునీటి యెద్దడి ఏర్పడకుండా సాసర్ తొట్టెల్లో తాగునీరు నింపామన్నారు. ఫారెస్ట్ బీట్‌లలో 25కు పైగా నీటి తొట్లు ఏర్పాటు చేశామన్నారు. లంకమల్ల అటవీ ప్రాంతంలో అరుదైన వన్యప్రాణులు జీవిస్తున్నాయని,వాటి సంరక్షణకు ప్రతిఒక్కరూ బాధ్యత వహించాలన్నారు. వన్యప్రాణులు సంచరిస్తే ఎటువంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే సమాచారం తెలపాలని ఆమె తెలిపారు. డిప్యూటీ రేంజర్ ఓబులేశు, ఫారెస్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

మేడేని విజయవంతం చేద్దాం: సీఐటీయూ

రాయచోటిటౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ కార్మికుల దినోత్సవం మేడేని విజయవంతం చేద్దామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు పిలుపునిచ్చారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో మేడే నిర్వహణపై సీఐటీయూ ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. సీఐటీయూ నాయకులు భాగ్యలక్ష్మి, సుబ్రమణ్యంరాజు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు చెన్నయ్య, రాంబాబు పాల్గొన్నారు.

ప్రపంచంలోనే అతిపెద్ద సేవా సంస్థ లయన్స్‌క్లబ్



సమావేశంలో మాట్లాడుతున్న లయన్స్‌క్లబ్ గవర్నర్ గౌతమ్

రాజంపేట, ఏప్రిల్ 27(ఆంధ్ర జ్యోతి) :ప్రపంచంలోనే అతిపెద్ద సేవాసంస్థ లయన్స్‌క్లబ్ అని లయన్స్‌క్లబ్ గవర్నర్ గౌతమ్ పేర్కొన్నారు. ఆదివారం గీతాంజలి డిగ్రీ కళాశాలలో లయన్స్‌క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 316జె మూడో క్యాబినెట్ సమావేశం డిస్ట్రిక్ గవర్నర్ గౌతమ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి నెల్లూరు జిల్లా, అనంతపూర్, కర్నూలు, కడప జిల్లాల లయన్స్ ప్రతినిధులు హాజరయ్యారు. డిస్ట్రిక్ గవర్నర్-1 గోపాలకృష్ణ, గవర్నర్-2 విరూపాక్షరెడ్డి, ఎలక్ట్ గవర్నర్ వైవీ రావు, రీజన్ చైర్మన్ సంబావు వెంకటరమణ, జోన్ చైర్మన్ సుబ్రమణ్యంరాజు, డిస్ట్రిక్ చైర్మన్ పోతుగుంట రమేష్‌నాయుడు, క్లబ్ ప్రెసిడెంట్ నరసింహరాజు, కార్యదర్శి పి.సంతోష్, కోశాధికారి నరసింహ, క్లబ్ సభ్యులు డాక్టర్ సి.సుధాకర్, డాక్టర్ నవీన్, డాక్టర్ బాలరాజు, నాసరుద్దీన్, విజయ్‌కుమార్‌రాజు, రామచంద్రరాజు, దండే రవికుమార్ పాల్గొన్నారు. ఉత్తమ సేవలందించిన లయన్స్ గవర్నర్, డిస్ట్రిక్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడికి ప్రత్యేక పిన్ బహూకరించారు.

సమాజ సేవతోనే ఆత్మ సంతృప్తి

● మానవత నెలవారి సమావేశంలో వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి



మాట్లాడుతున్న మానవతా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి

రాయచోటి టౌన్, ఏప్రిల్27(ఆంధ్రజ్యోతి): సమాజ సేవతోనే ఆత్మ సంతృప్తి కలుగుతుందని మానవతా సంస్థ వ్యవస్థాపకుడు రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం రాయచోటి పట్టణంలోని ప్రతిభ జూనియర్ కళాశాలలో మానవతా నెలవారి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాయచోటి బార్ అసోషియేషన్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాద మూకలు దాడులు చేసి హతమార్చడం పిరికిపంద చర్య అన్నారు. మృతులకు సంతాపం తెలిపారు. మానవత సంస్థ ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా అనేక రకాల సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆయన వివరించారు. మానవతా సంస్థ అధ్యక్షుడు గాండ్లపెంట ఖాదర్ బాషా, సెక్రటరీ అంకం జయచంద్రారెడ్డి, చైర్మెన్ అరమాటి శివగంగిరెడ్డి, కన్వీనర్ బాబు, గౌరవ సలహాదారులు వెంకటరమణ, కో చైర్మన్ షకీల్ మాజీ సెక్రటరీ వెంకటరామానాయుడు పాల్గొన్నారు.

బావిలో పడ్డ జింక

● రక్షించిన ఫారెస్టు అధికారులు

కడప క్రైం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కుక్కలు తరుముకుంటూ రావడంతో ప్రమాదవశాత్తు బావిలో పడిన జింకను ఆదివారం ఫారెస్టు అధికారులు రక్షించారు. మామిళ్లపల్లె బీట్ కొన్నేపల్లి పంచాయతీ సమీపంలో రెండు సంవత్సరాల వయస్సు గల జింకను కుక్కలు తరుముకుంటూ రావడంతో 100అడుగుల లోతు బావిలో పడింది. సమాచారం అందుకున్న మామిళ్ల పల్లె సెక్షన్ సిబ్బంది గ్రామస్థుల సాయంతో జింకను రక్షించారు. అనంతరం జిల్లా వెటర్నరీ ఏడీ హాస్పిటల్‌లో జింకకు వైద్య పరీక్షలు నిర్వహించి మామిళ్లపల్లె రిజర్వు ఫారెస్టులో వదలిపెట్టారు. ఈ ఆపరేషన్‌లో కడప ఎఫ్ఆర్‌వో కె.ప్రసాద్, మామిళ్లపల్లె సెక్షన్, బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొన్నారు.

రిమ్స్ కళాశాలకు ప్రిన్సిపాల్ నియామకం

కడప సెవెన్ రోడ్స్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఆసుపత్రుల సూపరింటెండెంట్లను, వైద్య కళాశాలలకు నూతన ప్రిన్సిపాళ్లను నియమించింది. ఇందులో భాగంగా ఒంగోలులో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జమునను కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్) ప్రిన్సిపాల్‌గా నియమించింది. ఇక్కడి ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖను నంద్యాల జీజీహెచ్‌కు బదిలీ చేశారు.

నిరుపయోగంగా రైతుబజారు

● రూ.1.50 కోట్ల ప్రజాధనం వృథా

● వ్యాపారులకు కొరవడిన వసతులు

● స్టాల్స్ పెట్టుకునేందుకు ఆసక్తి చూపని వైనం





నిరుపయోగంగా ఉన్న రైతుబజారు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మార్కెట్ యార్డు వద్ద నిర్మించిన రైతు బజారు నిరుపయోగంగా మారింది. చిన్న రైతులు పండించిన కూరగాయలు, వ్యవసాయ ఉత్పత్తులను ఇక్కడ విక్రయిస్తే గిట్టుబాటు ధర ఉంటుందని భావించి గత ప్రభుత్వ హయాంలో మార్కెట్‌యార్డులో రూ.1.50 కోట్ల వ్యయంతో రైతు బజారు నిర్మాణం చేపట్టారు. రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం రావడంతో మిగిలిన పనులు పూర్తి చేసి ప్రజలకు వినియోగంలోకి తీసుకువచ్చారు. కూరగాయల షెడ్లతో పాటు వాణిజ్య సముదాయం నిర్మించారు. ఈ రైతు బజారును 2024 జనవరి 17వతేదీన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. గతంలో కేవలం నాలుగైదు రోజులు మాత్రమే ఇక్కడ కూరగాయల విక్రయాలు జరిగాయి. ఆ తరువాత ఒక్కరు కూడా ఈ రైతు బజారు వైపు కన్నెత్తి చూడకపోవడంతో నిరుపయోగంగా మారింది. కానీ మున్సిపల్ అధికారులు పట్టణంలోని రంగనాయకుల గుడి కాంప్లెక్స్‌లో మార్కెట్ నిర్వహిస్తున్నారు. అయితే కొన్ని పెద్ద కూరగాయల అంగళ్లు మాత్రం పట్టణంలోని రంగనాయకుల స్వామి గుడి సమీపంలోని మార్కెట్‌లో వారపు సంత నిర్వహిస్తున్నారు. అలాగే బస్టాండు సర్కిల్‌లో చిరు వ్యాపారస్తులు ఇప్పటికీ విక్రయాలు నిర్వహిస్తున్నారు. పాత మార్కెట్లో మాత్రం అధికారులు రాజకీయ వత్తిళ్ల కారణంగా తొలగించలేదు. అదే విధంగా పట్టణంలో ప్రధాన రహదారులలో రోడ్డు వైపు స్థలాలు ఆక్రమించుకుని కొందరు కూరగాయల వ్యాపారం చేసుకుంటున్నవారిని కూడా అధికారులు తొలగించలేదు. దీంతో ప్రస్తుతం వారపు సంత జరిగే ప్రాంతంలో వ్యాపారులు లేక ప్రజలు రాక చిరువ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి కూరగాయల విక్రయాలు పూర్తిగా వారపుసంత జరిగే ప్రదేశంలోకి తరలించడంతో పాటు లక్షలాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన రైతు బజారులో రైతులు కూరగాయల విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలని చిరువ్యాపారులు, ప్రజలు కోరుతున్నారు.

ఎలాంటి ప్రణాళికలు లేకుండా రైతు బజారు నిర్మించడంతో ఇక్కడికి మారేందుకు వ్యాపారులు ఆసక్తి చూపడం లేదు. కాంట్రాక్టు తీసుకున్న వైసీపీ నాయకులు నిధుల విషయంలో చూపిన ఆసక్తి నిర్మాణంలో చూపడంలేదన్న విమర్శలున్నాయి. తూతూ మంత్రంగా నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడంతో మార్కెట్ సముదాయంతో ఏర్పాటు చేసిన దుకాణాలు ఎందుకు పనికిరావన్నది అర్థమవుతోంది. దీంతో పట్టణంలోని పాత రంగనాధస్వామి మార్కెట్లో అంగళ్లు ఏర్పాటు చేసుకుని వ్యాపారం సాగిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. కొత్తగా నిర్మించిన మార్కెట్ లోపలికి ఉన్నందున కొనుగోలుదారులు ఇక్కడికి వచ్చే అవకాశం లేదని వ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారం లేకపోతే మా పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావున సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నిరుపయోగంగా ఉన్న మార్కెట్‌ను వినియోగంలోకి తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు. ఈ విషయంపై మార్కెట్‌యార్డు సెక్రటరీ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రైతు బజారును పూర్తిగా వినియోగంలోకి తెచ్చి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు.

కేజీపీజీ సెట్‌కు విశేష స్పందన



కేజీసెట్ ప్రశ్నాపత్రాలను విడుదల చేస్తున్న కందుల చంద్ర ఓబుళరెడ్డి (నాని), రాజేశ్వరమ్మ తదితరులు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కందుల గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఆధ్వర్యంలో డిగ్రీ పూర్తి చేసి పోస్టుగ్రాడ్యుయేషన్ చేయాలనుకునే వారికోసం నిర్వహించిన కేజీపీజీ2కె25కు విశేష స్పందన వచ్చిందని, కడప, చిత్తూరు జిల్లాల నుండి అధిక సంఖ్యలో విద్యార్థులు హాజరైనట్లు కేఎస్ఆర్ఎం కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆఫ్ స్టడీస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగమణి తెలిపారు. ఏపీ ప్రభుత్వం నిర్వహించే ఐసెట్ తరహాలో ఈ పరీక్ష నిర్వహించామని, టాప్‌ర్యాంకు సాధించినవారికి ఉచిత అడ్మిషన్ కల్పిస్తామని అన్నారు. కళాశాల ఎండీ కందుల చంద్ర ఓబుళరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది మార్గదర్శకాలను, సలహాలను తీసుకుని ఉన్నత రంగాల్లో స్థిరపడాలని, పటిష్ట ప్రణాళికతో లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ కందుల రాజేశ్వరమ్మ, కేఎల్ఎం ప్రిన్సిపాల్ రత్నమ్మ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ జట్టు ఎంపికలు



పోటీలకు ఎంపికైనవిద్యార్థులు

కమలాపురం రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ బాలురు, బాలికల విభాగంలో 8 మంది విద్యార్థులు ఎంపికైనట్లు సీఎస్ఎస్ఆర్ అండ్ ఎస్ఆర్ఆర్ఎం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలిండియా ఇంటర్ యూనివర్శిటీ సాఫ్ట్‌బాల్ పోటీల కోసం వైవీయూ తరపున ఎంపిక ప్రక్రియ నిర్వహించారని, ఇందులో తమ కళాశాల విద్యార్థులు సలావుద్దీన్, చిన్నిక్రిష్ణ, శేషాద్రి, సోయల్, షాబుద్దీన్, రుచిత, ఆలియా సుల్తానా, సైదా ఎంపికైనట్లు తెలిపారు. వీరు ఈనెల 30 నుండి మే 8వ తేదీ వరకు నెల్లూరులో జరిగే ఆలిండియా పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అభినందించారు.

జలాశయంలో ఈతకు వెళ్లి వ్యక్తి మృతి

మైలవరం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయంలో ఈతకు వెళ్లి వేముల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం (53) అనే వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ శ్యాంసుందర్‌రెడ్డి ఆదివారం తెలిపారు. ఎస్ఐ వివరాల మేరకు.. పులివెందుల నియోజకవర్గం వేముల గ్రామానికి చెందిన షేక్ ఇబ్రహీం, తన సోదరుడు వారివారి కుటుంబాలతో కలిసి మండలంలోని గైబుషావలి దర్గాను సందర్శించుకున్నారు. తిరుగు ప్రయాణంలో మైలవరం జలాశయం వద్దకు వచ్చి సహోదరుడితో కలిసి తక్కువ లోతు ఉన్న ప్రదేశంలో ఈతకు దిగారు. అనంతరం ఒడ్డుకు తిరిగి వస్తుండగా జలాశయంలోని గుంతలో జారిపడి నీటిలో మునిగాడు. వెంటనే మైలవరం పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసు సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో జలాశయంలో షేక్ ఇబ్రహీం మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి భార్య షేక్ రహిమూన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ద్విచక్రవాహనంపై నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన ఓబులేసు

బ్రహ్మంగారిమఠం, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా ద్విచక్రవాహనంపై నుండి జారిపడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది.మండలంలోని తోట్లపల్లె వీఆర్వో కాలనీకి చెందిన ఆరవేటి ఓబులేసు (52) మధ్యాహ్న సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి వస్తుండగా ద్విచక్ర వాహనంపై నుంచి జారి పడి మృతి చెందినట్లు అతని కుమారులు తెలిపారు. విషయం తెలుసుకున్న పలువురు టీడీపీ నేతలు ఓబులేసు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన ఓంకారేశ్వరరావు

సీకేదిన్నె, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): కడప- రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వల చెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓంకారేశ్వరరావు (38) అనే ఏపీ మోడల్ స్కూల్ అధ్యాపకుడు మృతి చెందాడు. కడప నగరం అక్కాయపల్లెలో నివాసం ఉండే ఓంకారేశ్వరరావు రామాపురంలోని మోడల్ స్కూల్‌లో విధులు నిర్వహించేవాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం రాయచోటికి వెళ్లి తిరిగి వస్తుండగా గువ్వల చెరువు ఘాట్ రెండో మలుపు వద్ద రాయచోటివైపు నుండి కడపకు వస్తున్న టమోటా మినీ లారీ టైరు పంక్చర్ అయి అదుపు తప్పి పక్కనే ఉన్న ఓంకారేశ్వరరావు ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఓంకారేశ్వరరావు టమోటా లారీ కింద పడటంతో మరణించాడు. విషయం తెలుసుకున్న సీఐ శివశంకర్‌నాయక్ ఘటనా స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

స్థలం విషయమై తల్లీకొడుకుపై దాడి

● తీవ్ర గాయాలతో స్పృహ తప్పిన తల్లి

చెన్నూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పరపల్లెకు చెందిన పంగా శసింద్రి (49)తో పాటు ఆమె కుమారుడు పంగా ఈశ్వరయ్యలపై ఖాజీపేట మండలం నాగసానిపల్లెకు చెందిన పంగా సుబ్బరాయుడు, మరో ముగ్గురు కలిసి దాడి చేయడంతో తీవ్ర గాయాలపాలయ్యారు. ఉప్పరపల్లెకు చెందిన పంగా వెంకటసుబ్బయ్య, పంగా సుబ్బరాయుడు అన్నదమ్ములు. వీరికి గ్రామంలో ఉన్న పదిసెంట్ల స్థలం విషయమై ఇద్దరి మధ్య మనస్పర్థలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం రాత్రి వెంకటసుబ్బయ్య భార్య పంగా శసింద్రి, ఆమె కుమారుడు పంగా ఈశ్వరయ్య, కోడలు సుధావాణి ఇంటి వద్ద ఉన్నారు. నాగసానిపల్లెలో ఉండే పంగా సుబ్బయుడు తన బంధువులైన పంగా వెంకటసుబ్బయ్య, చౌడయ్య, సిద్దం సుబ్బరాయుడు మద్యం తాగి వచ్చి అసభ్యకరంగా దూషిస్తూ ఇంటి వద్ద ఉన్న వీరిపై దాడి చేశారు. ఈ దాడిలో రాడ్లు, కర్రలు ఉపయోగించడంతో శశింద్రి, ఈశ్వరయ్యలు తీవ్రంగా గాయపడ్డారు. కాగా శసింద్రికి తలపై బలమైన గాయం కావడంతో స్పృహ తప్పి పడిపోయింది. గాయపడిన వారిని 108 వాహనంలో రిమ్స్‌కు తరలించారు. ఈ విషయమై పంగా వెంకటససుబ్బయ్య స్థానిక పోలీసుస్టేషనులో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

తల్లీకూతురిపై దాడి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): తల్లీకూతురిపై దాడి చేసి గాయపర్చిన సంఘటన మదనపల్లె మండలంలో చోటు చేసుకుంది. తాలూకా పోలీసుల కథనం మేరకు.. మదనపల్లె మండలం, కొత్తపల్లె పంచాయతీ, వడ్డిపల్లెకు చెందిన టి. సునీత (38) శ్రావణి (17)పై అదే గ్రామానికి చెందిన నలుగురు మహిళలు, నలుగురు యువకులు దాడి చేసి గాయపర్చారు. దీంతో గాయపడిన వారిని స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా బాధితురాలు మాట్లాడుతూ ఇంట్లోకి ఎందుకు తొంగి చూస్తున్నారని యువకులను అడిగినందుకు ఎనిమిది మంది ఇంట్లో దూరి దాడి చేసి గాయపర్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు తాలూకా సీఐ తెలిపారు.

ఏఐటీయూసీ వర్సెస్ సీఐటీయూ

● జెండా దిమ్మె ఏర్పాటులో వివాదం ● పరస్పర దాడులతో ఉద్రిక్తత



పరస్పరం వాదించుకుంటున్న కార్మిక సంఘాల నేతలు.. ఇరువర్గాలకు సర్దిచెబుతున్న వన్‌టౌన్ ఎస్ఐ శివకుమార్

మదనపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): జెండా దిమ్మె ఏర్పాటు విషయంలో ఏఐటీయూసీ, సీఐటీయూ నేతలు పరస్పరం వాగ్వాదానికి దిగారు ఒకానొక దశలో ఒకరిపై ఒకరు దాడులకు తెగబడడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. చివరకు పోలీసుల రంగప్రవేశంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. మదనపల్లె మున్సిపల్ కార్యాలయం ముందు ఆదివారం సీఐటీయూ నాయకులు జెండా దిమ్మె ఏర్పాటుకు సిద్ధమయ్యారు. అయితే, ఎప్పటి నుంచో అక్కడ తామే జెండా ఎగురవేస్తున్నామని, కొత్తగా సీఐటీయూ రావడం ఏంటని ఏఐటీయూసీ నాయకులు అడ్డుకున్నారు. తామూ కార్మికులమేనని, తమకూ హక్కు ఉందంటూ, ఏఐటీయూసీ నాయకులు సురేష్‌కుమార్, ముబారక్, పృధ్వీరాజ్, దేవా, ఓబులేసు, నాగరాజు, సాంబశివ, అశోక్, తదితరులు సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు, రామకృష్ణ, తదితరులను నిలదీశారు. దీంతో ఇరువర్గాల మధ్య ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో సీఐటీయూ రామకృష్ణపై దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. వన్‌టౌన్ పోలీసులు రంగప్రవేశం చేయడంతో వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. సోమవారం మున్సిపల్ కమిషనర్ ప్రమీలతో చర్చించాకే నిర్ణయం తీసుకోవాలని ఎస్ఐ చెప్పడంతో ఇరువర్గాలు శాంతించాయి. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.

30న పాలీసెట్ ప్రవేశ పరీక్ష

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలిసెట్ పరీక్ష ఈనెల 30వ తేదీన నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జింకా అశోక్‌బాబు తెలిపారు. ఈ పరీక్ష కోసం 4,135 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని, వారికోసం పల్లవోలులోని సీబీఐటీ కళాశాల, లింగాపురంలోని ఎస్ఆర్ఐటీ ఇంజనీరింగ్ కళాశాల, కొర్రపాడు రోడ్డులోని వైఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, ఎస్‌కేఎస్‌సీ డిగ్రీ కళాశాలల్లో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్ష ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతుందని, విద్యార్థులు అరగంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులు హాల్‌టిక్కెట్, ఆధార్‌కార్డు లేదా ఏదైనా ప్రభుత్వ గుర్తింపుకార్డు, రెండు ఫోటోలు, బాల్‌పెన్, హెచ్‌బీ పెన్సిల్, ఎరేజర్, షార్ప్‌నర్లతో పరీక్షకు హాజరుకావాలన్నారు. మొబైల్స్, కాల్కులేటర్లు, ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను అనుమతించమన్నారు.

వైభవంగా అక్కదేవతల తిరునాళ్లు



ఎర్రగుంట్ల, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తిప్పలూరు గ్రామంలో వెలసిన ముగ్గురు అక్కదేవతల తిరునాళ్లు ఆదివారం వైభవంగా జరిగింది. తిరునాళ్ల సందర్భంగా మూడు రోజులుగా ఇక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చివరిరోజు ఆదివారం అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం సాయంత్రం బండలాగుడు పోటీలు నిర్వహించారు. నంద్యాల జిల్లాకు చెందిన ఎడ్లు 1251 అడుగులు లాగి రూ.లక్ష ప్రథమ బహుమతిని గెలుచుకున్నాయి. టీడీపీ ఇన్‌చార్జి సి.భూపేశ్ రెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో అంబటి క్రిష్ణారెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్



కురబలకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట జడ్పీహైస్కూల్ పక్కన ఉన్న ఇంట్లో దొంగలు హల్‌చల్ చేశారు. దీనికి సంబంధించి బాధితులు, పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కురబలకోట సమీపంలోని హైస్కూల్ సమీపంలోని మస్తాన్ ఇంట్లోకి చొరబడి చోరికి పాల్పడటంతో కలకలం రేగింది. కాగా మస్తాన్ ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్సలు పొందారు. ఆ సమయంలో ఇంట్లో ఉన్న దాదాపుగా 900గ్రాముల బంగారం, నగదును దోచుకెళ్ళారు. కాగా ఇంటి వెనుక వైపున ఉన్న ఫ్యాన్ రెక్కలను కట్ చేసి ఇంటిలోకి ప్రవేశించారు. అందులో విలువైన వస్తువులను తీసుకెళ్ళారు. ఆసుపత్రి నుంచి ఇంటికి వచ్చిన ఆయన దొంగతనం జరిగిందని గమనించి విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్ టీం, వేలిముద్రల నిపుణులతో ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షర్మిలపై పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నిన్న విజయవాడలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల జమ్ముకాశ్మీర్ ఉగ్రవాద దాడి విషయంగా విలేకరి అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఇంటర్నల్ టెర్రరిజం, మత విద్వేశాలను పోషిస్తున్నది బీజేపీనే అని మాట్లాడడం, ప్రధానమంత్రి మోదీపై అనుచిత వాఖ్యలు చేయడం సమంజసం కాదన్నారు. ఈ విషయంగా షర్మిలాపై వన్‌టౌన్ ఎస్ఐకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బండి ఆనంద్, భగవాన్, జర్మనీరాజు, పిల్లస్వామి నాయక్, తదితరులు పాల్గొన్నారు.



షర్మిలపై వన్‌టౌన్ ఎస్ఐకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులకు జ్యోతిరావు పూలే పురస్కారాలు

పీలేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన పలువురిని మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ పురస్కారాలు వరించాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా పెనుమూరుకు చెందిన తంత్ర జ్యోతిష్కులు చింతా రుగ్మాంగద రావు, పీలేరుకు చెందిన కళాకారుడు షేక్ ఖాదర్ బాషా, పీలేరుకు చెందిన తెలుగు భాషా సమితి అధ్యక్షుడు, కవి, రచయిత జలకనూరి మురళీధర్ రాజు, పీలేరు మండలం రేగళ్లుకు చెందిన సామాజిక సేవా కార్యకర్త యలిచెలమల షామీర్ మహాత్మా జ్యోతిరావు పూలే జాతీయ ఐకాన్ పురస్కారాలు అందుకున్నారు. తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలోని అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ఈ పురస్కారాలు అందజేసింది. మహాత్మా జ్యోతిరావు పూలే 198వ జయంతి, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేడ్కర్ 134వ జయంతి, కడపకు చెందిన ట్రాన్స్‌జెండర్, సామాజిక సేవా కార్యకర్త డా.షేక్ సమీరా ప్రథమ వర్థంతి సందర్భంగా అభిలాష సంస్థ విభిన్న రంగాల్లో విశేష సేవలు అందిస్తున్న వారికి పురస్కారాలు అందజేసింది. రాజమండ్రిలోని ఆనం రోటరీ క్లబ్ హాలులో ఆదివారం రాత్రి పురస్కారాలు ప్రదానం చేశారు.



పురస్కారాలు అందుకున్న రుక్మాంగద రావు, ఖాదర్ బాషా, జలకనూరి మురళీధర్ రాజు, షామీర్

పుష్పగిరి గిరిప్రదక్షిణపై అపోహలు వద్దు

● ఈవో శ్రీనివాసులు

వల్లూరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పుష్పగిరి గిరిప్రదక్షిణపై వస్తున్న అపోహలను నమ్మవద్దని ఈవో కె.శ్రీనివాసులు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని పుష్పగిరి లక్ష్మీచెన్నకేశవ స్వామి దేవస్థానం వద్ద జరిగే గిరిప్రదక్షిణపై కొన్ని స్థానిక పత్రికలు, వాట్సాప్ గ్రూపుల్లో రకరకాలుగా వార్తలు వస్తున్నాయని, భక్తులు వాటిని నమ్మరాదని ఆయన తెలిపారు. ఈ గిరిప్రదక్షిణ యధావిధిగా జరుపుతామని, ఇందులో భక్తులు, ధార్మిక సంఘాలు, హిందూబంధువులు అనుమానపడవలసిన అవసరం లేదని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి పౌర్ణమి రోజున గిరిప్రదక్షిణకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మంచినీటి సౌకర్యం, అల్పాహారం, మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.

తేనెటీగల దాడిలో ఇద్దరికి గాయాలు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):తేనిటీగల దాడిలో కురబలకోట మండలం, ఎర్రబోయనపల్లెకు చెందిన మాధవి (40) పెద్దన్న (46) గాయపడి ఆదివారం మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చారు. బాధితుల తెలిపిన వివరాల మేరకు పొలం వద్ద పనులు చేసుకొంటుండగా పొలంలోని చెట్టు నుంచి తేనేటీగలు దాడి చేశాయి. ఈ దాడిలో ఇద్దరు గాయపడినట్లు తెలిపారు.

రోడ్లు అధ్వానం.. ప్రయాణం నరకప్రాయం

- అడుగడుగునా గోతులతో అవస్థలు
- తరచూ ప్రమాదాలతో గ్రామీణుల ఆందోళన

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): గోతుల మయమై.. ప్రమాదాలకు కారణమవుతున్న గ్రామీణ రోడ్లకు ఎప్పుడు మోక్షం కలుగుతుందోనని ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో నాయకులు విచ్చలవిడిగా అక్రమంగా ఇసుక, మట్టి తరలించడంతోనే ఈ రహదారులు గుంతలమయంగా మారిపోయాయని, వాటి మరమ్మతులను గాలి కొదిలేయడంతో ఈ మార్గాల్లో ద్విచక్ర వాహనంప ప్రయాణించేందుకు సాహసం చేయాల్సి వస్తోందని గ్రామీణులు ఆరోపిస్తున్నారు.



గుంతలమయమైన కందుకూరు - చేలూరు మెయిన్‌రోడ్డులో ఇక్కట్లు పడుతున్న వాహనదారులు



తారు, కంకర లేచిపోయి అస్తవ్యస్తంగా మారిన పీటీఎం - అంకిరెడ్డిపల్లె రోడ్డు

అస్తవ్యస్తంగా కందుకూరు- చేలూరు రోడ్డు

మండలంలోని మద్దయ్యగారిపల్లె నుంచి కందుకూరు మీదుగా చేలూరుకు వెళ్లే ప్రధాన రహదారిలో నిత్యం సుమారు 17 బస్సు సర్వీసులు తిరుగుతుంటాయి. కందు కూరు సమీపంలోని అగ్రహారం వద్ద ఈ రోడ్డు గుంతలమ యం కావడంతో వర్షం వచ్చినపుడు వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి సు మారు 15 కిలోమీటర్ల మేర పెద్దపెద్ద గుంతలతో వాహనచోదకుల సహనాన్ని పరీక్షిస్తోంది. ఎంత జాగ్రత్తగా వాహనాలను నడిపినా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఎన్నో ప్రమాదాలు జరిగినా, తాత్కాలిక మరమ్మతులతోనే సరిపెట్టారు.. కనీసం ఈ ప్రభుత్వంలోనైనా రహదారులను బాగుచేయాలని కోరుతున్నారు.

అధ్వానంగా అంకిరెడ్డిపల్లె రోడ్డు

మండల కేంద్రం నుంచి బెట్టకొండ సమీపంలోని నాయన వారిపల్లెకు వెళ్లే అంకిరెడ్డిపల్లె రోడ్డు సుమారు 7 కిలోమీటర్లు ఉంటుంది . సుమారు. 10 గ్రామాలకు చెందిన ప్రజలు ఈ రోడ్డు గుండానే మండల కేంద్రానికి వెళుతుంటారు. ఈ రోడ్డు మండల కేంద్రం నుంచి కంకర తేలిపోయి. గుంతల మయమైంది. ఇప్పుడైనా ఈ రోడ్డుకు మహర్దశ కలుగు తుందా? అని ప్రజలు ఎదురు చూస్తున్నారు.

పీటీఎం - రంగసముద్రం రోడ్డుదీ అదే పరిస్థితి

మండల కేంద్రం నుంచి విసనకర్రవాండ్లపల్లె మీదుగా రంగసముద్రం వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసమైంది. వైసీపీ ప్రభుత్వంలో రంగసముద్రం నుంచి పీటీఎం వరకు ఉన్న 6 కిలోమీటర్ల రోడ్డు పనులు పూర్తి చేశారు. ఆ సమయంలో టిప్పర్ల సంచారం కారణంగా రోడ్డు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

రోడ్ల మరమ్మతులకు ప్రతిపాదనలు

గ్రామీణ రహదారుల మరమ్మతుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని పంచాయతీరాజ్ శాఖ అధికారులు చెబుతున్నారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి వెళ్లే లింకు రోడ్ల మరమ్మతులపై ప్రభుత్వానికి నివేదించామని అనుమతులు రాగానే పనులను ప్రారంభిస్తామని పంచాయతీరాజ్ ఏఈ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

గుండెపోటుతో బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు మృతి

వాల్మీకిపురం, ఏప్రిల్ 27 (ఆం ధ్రజ్యోతి): పట్టణానికి చెందిన సీనియర్ బాస్కెట్‌బాల్ క్రీడాకారుడు, జిల్లా అసోసియేషన్ మాజీ సభ్యుడు ఎన్. రెడ్డి రామ్(49)ఆదివారం ఉదయం గుండెపోటుకు గురై మృతి చెం దాడు. 24 ఏళ్లగా బాస్కెట్ బాల్ క్రీడలో ఎంతో మందికి శిక్షణ ఇచ్చి తీర్చి దిద్దడమే కాక ఎంతో మంది క్రీడాకారుల అభివృద్ధి కి తోడ్పడ్డారని ఆయన సేవలను కొనియాడారు. జిల్లా బాస్కెట్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతల శ్రీధర్ రెడ్డి, సీనియర్ క్రీడాకారులు రవిచంద్ర, సుబ్రహ్మణ్యం, స్థానిక ప్రజాప్రతినిధులు, యువత క్రీడాకారులు రెడ్డిరామ్ మృతదేహం వద్ద పూల మాలలు వేసి నివాళులర్పించారు. రెడ్డిరామ్ కు టుంబ సభ్యులను పరామర్శించారు.

నేడు ఉచిత ఖత్నా శిబిరం

కలికిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పల్లవోలు పంచాయతీ గడి గ్రామంలో సోమ వారం ఉచిత ఖత్నా శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకుడు షేక్ షఫీవుల్లా తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంకాల 5 గంటల వరకూ శిబిరం ఉంటుందన్నారు. ఖత్నా చేసుకున్న పిల్లలందరికీ ఉచితంగా మందులు, గోధుమ పిండి, నెయ్యి, బెల్లం, రాగిపిండి పంపిణీ చేస్తామన్నారు. డాక్టర్లు టి.అబ్దుల్ రజాక్, షేక్ జాకీర్ బాషా ఖత్నా చేస్తారని వివరించారు.

పాలిసెట్‌కు హాల్ టికెట్లు సిద్ధం

కలికిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల అడ్మిషన్ల కోసం నిర్వహించనున్న పాలిసెట్‌కు హాజరయ్యే అభ్యర్థుల కోసం హాల్ టికెట్లు సిద్ధంగా వున్నట్లు పాలిసెట్ జిల్లా కోఆర్డినేటర్, కలికిరి ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాసులు తెలిపారు. బుధవారం పాలిసెట్ పరీక్షలు జరుగనున్నట్లు చెప్పారు. అభ్యర్థులు హాల్ టికెట్లను పాలిసెట్ ఏపీ వెబ్‌సైటు నుంచి డౌన్‌లోడ్ చేసుకోవలసిందిగా కోరారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి) : ఆటో అదుపు తప్పడంతో ఓ మహిళకు గాయాలయ్యాయి. స్థానికులు అందించిన సమాచారం మేరకు.. మండలంలోని కమ్మచెరువుకు చెందిన 9 మంది మహిళలు ఓ షేర్ ఆటోలో టి.సదుం గ్రామానికి కూలి పనులకు వెళ్తుండగా చెన్నరాయునిపల్లె క్రాస్ సమీపంలో చక్రం ఊడిపోవడంతో ఆటో అదుపు తప్పి పడిపోయింది ఈ ప్రమాదంలో కమ్మచెరువుకు చెందిన మంజు నాథ్ బార్య ఆంజనమ్మ (38) తీవ్రంగా గాయపడింది, మిగిలిన 8 మందికి స్వల్ప గాయాలయ్యాయి ఆమెను 108 వాహనం ద్వారా బి.కొత్తకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆమెను పరీక్షించి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై ఎటువంటి ఫిర్యాదు అందలేదని పీటీఎం ఎస్‌ఐ హరిహరప్రసాద్ తెలిపారు.

ఉత్తర్వుల కోసం పోలీసుల ఎదురుచూపు

మదనపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పాకిస్తాన్ పౌరసత్వం కలిగిన ఐదుగురు వ్యక్తుల తరలింపులో ప్రభుత్వ ఆదేశాల కోసం పోలీసులు ఎదురుచూస్తున్నారు. పాకిస్తాన్ పౌరులు ఈనెల 27 నాటికల్లా దేశం విడిచి వెళ్లిపోవాలని, మెడికల్ వీసాపై వచ్చిన పాకిస్తానీయులు ఈ నెల 29వ తేదీ కల్లా దేశం విడిచి వెళ్లిపోవాలని ఆదేశాలున్న నేపథ్యంలో ..పోలీసులు మదనపల్లెలోని పాకిస్తానీయుల విషయంలో ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు.

పాకిస్థాన్‌కు బుద్ధిచెప్పాలి



కలకడలో ర్యాలీ చేస్తున్న నాయకులు, ప్రజలు

కలకడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):సరిహద్దులో ప్రేరేపిత ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న పొరుగుదేశం పాకిస్తాన్‌కు గట్టిగా బుద్ధి చెప్పాలని పీలేరు అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ భారతప్రభుత్వాన్ని కోరారు. పహల్గాం ఉగ్రవాద దాడిలో మరణించిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం కలకడలో కూటమి నాయకులు, ప్రజలు జాతీయ జెండాలు చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని నేరుగా ఎదుర్కొనే సత్తాలేక ఇలాంటి దుర్మార్గపు చర్యలకు పాక్ ఆజ్యం పోస్తోందని ఆరోపించారు. ముష్కరుల స్థావరాలకు నిలయమైన పీవోకే తక్షణమే స్వాధీనం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు బీవీ స్వామి, శ్రీనివాసులురెడ్డి, పీవీ నాయుడు, ఆంజనేయులనాయుడు, వై.జిలానీ, శేఖర్, నౌషాద్, ముబారక్, జనార్దన్ నాయుడు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో పకడ్బందీగా వ్యవహరించాలి



పోలీసుస్టేషన్‌లో ఎస్‌ఐతో మాట్లాడుతున్న డీఎస్పీ మహేంద్ర

తంబళ్లపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణలో పకడ్బందీగా వ్యవహరించాలని డీఎస్పీ మహేంద్ర అన్నారు. తంబళ్లపల్లె పోలీస్‌స్టేషన్‌ను ఆదివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ నిర్వహణ, క్రైమ్ రికార్డులు, సిబ్బంది పనితీరు, విధులు, కేసుల దర్యాప్తు తదితర రికార్డులను పరిశీలించారు. పెండింగ్ కేసుల వివరాలను ఎస్‌ఐ లోకేశ్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడతూ... పోలీసులు నిరం తరం విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, పోలీసు స్టేషన్‌ను ఆశ్ర యించే వారితో మర్యాదగా వ్యవహరించాలన్నారు. గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెంచి, పాత నేరస్తుల కదలిక లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చైతన్యం తేవాలన్నారు. జూదాలు, కోడిపందేలు, నాటు సారా తయారీ, అక్రమ మద్యంపై ఉక్కు పాదం మోపాలని సూచిం చారు. ఏఎస్‌ఐ నరసింహులు, కానిస్టేబుళ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



వ్యవసాయ బోరు వద్ద తాగునీరు పట్టుకుంటున్న గ్రామస్తులు

పెద్దమండ్యం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి) తాగునీటి సమస్య తీర్చాలని మండలంలోని సి.గొల్లపల్లి, ఎన్‌వోపల్లి గ్రామ పంచాయతీ మిట్టావాండ్లపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు. సుమారు 60 కుటుంబాలు నివాసముంటున్న సి.గొల్లపల్లిలో బోరు నుంచి నీరు సక్రమంగా అందడంలేదని గ్రామస్తులు చెపుతున్నారు. మూడు రోజుల క్రితం అధికారులు రీబోరు వేసినా నీరు సరిగా సరఫరా కాకపోవడంతో వ్యవసాయ బోర్లనుంచి తాగునీరు తెచ్చుకుంటున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గత టీడీపీ హయాంలో వేసిన తాగునీటి పథకం బోరులో నీరు ఉందని ఆ బోరులో మోటరు అమర్చి పరిశీలించాలని పలువురు కోరుతున్నారు. గ్రామంలోని బోర్లకు కూడ మరమ్మతులు చేయాలన్నారు.

మిట్టావాండ్లపల్లి గ్రామం సమీపంలోని బండ మీద వున్న ఇండ్లకు తాగునీటి సరఫరా పూర్తిగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు వెంటనే చర్యలు తీసుకొని తాగునీటి సమస్య తీర్చాలని ఆ రెండు గ్రామ ప్రజలు కోరారు. సమస్య పరిష్కారానికి సోమవారం చర్యలు తీసుకుంటామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అశోక్ తెలిపారు.

10 నుంచి ఏఐటీయూసీ జిల్లా వర్క్‌షాప్

బి.కొత్తకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లెలో మే 10, 11 తేదీల్లో నిర్వహించనున్న ఏఐటీయూసీ జిల్లాస్థాయి వర్క్‌షాప్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధానకార్యదర్శి సాంబశివ పిలుపునిచ్చారు. ఆదివారం బి.కొత్తకోటలోని దిగువబస్టాండ్‌లో స్థానిక నాయకులతో కలిసి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలన రద్దుచేసి తీరని అన్యాయం చేస్తోందన్నారు. శ్రమజీవులకు కనీసవేతనం రూ.35వేలు ఇవ్వాలని, హక్కులసాధన కోసం ప్రపంచ కార్మికుల దినోత్సవం సందర్భంగా జిల్లా వ్యాప్తంగా జరిగే నిరసన కార్యక్రమాలలో కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు వేణుగోపాల్‌రెడ్డి, సలీంబాషా, సమావుల్లా, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బాలకృష్ణ, శివకుమార్, సాధిక్, అంజాద్, వలీ, గౌస్, నాగరాజు, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీలు

బి.కొత్తకోట, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): బి.కొత్తకోట పట్టణంలోని బీసీ కాలనీలో ఆదివారం పోలీసులు ములకల చెరువు సీఐ లక్ష్మణ్ణ ఆధ్వర్యంలో వాహనాల ను తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేని 40 ద్విచక్రవాహనాలను సీజ్ చేశారు. అనంతరం సీఐ వాహనదారులతో మాట్లాడుతూ సరైన ధ్రువపత్రాలు లేని వాహనాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో స్వాధీనం చేయాలని సూచించారు. కుటుంబ యజమానులు మైనర్లకు ద్విచక్రవాహనాలు ఇవ్వడం వల్ల అనేక అనర్థాలు సంభవిస్తున్న విషయాన్ని గుర్తించాలని, పిల్లలు ద్విచక్రవాహనాలు ఇష్టారాజ్యంగా నడిపితే భారీ జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.


ఆర్‌వోబీ పిల్లర్లపై గడ్డర్ల ఏర్పాటు

పీలేరు, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): పీలే రు- మదనపల్లె మార్గంలో నిర్మితమవుతు న్న రైల్ ఓవర్ బ్రిడ్జి పనుల్లో ఆదివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆర్‌వోబీ కోసం నిర్మించిన పిల్లర్లపై గడ్డర్ల ఏర్పాటును కాంట్రాక్టు సంస్థ ఆదివారం చేపట్టింది. అందులో భాగంగా తొలి గడ్డర్‌ను శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఏర్పాటు చేశారు. రెండు భారీ క్రేన్‌ల సాయంతో గడ్డర్‌ను పిల్లర్లపై ఏర్పాటు చేశారు. గడిచిన రెండేళ్లుగా సాగుతున్న ఆర్‌వోబీ నిర్మాణం కారణంగా చికా కు పడుతున్న పీలేరు వాసులు గడ్డర్ల ఏర్పాటుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పని పూర్తయితే, దుమ్ము, ధూళి, ట్రాఫిక్ సమ స్యల నుంచి తమకు విముక్తి లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

‘మాలలు సంఘటితం కావాలి’

పీలేరు, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ఇటీవలి కాలంలో వరుస దాడులు ఎదుర్కొంటున్న మాలలు తమ ఆత్మగౌరవం కోసం సంఘటితం కావాలని అఖిల భారత మాలసంఘాల జేఏసీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు గుర్రం నారాయణ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న మాల మేధావులు, ప్రజాప్రతినిధుల రౌండ్ టేబుల్ సమావేశం ఆదివారం పీలేరులో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్గీకరణ కారణంగా జరుగుతున్న నష్టాలను అధిగమించేందుకు త్వరలోనే కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. ఇటీవల పిఠాపురం నియోజకవర్గంలో దళితులను ఊరి నుంచి బహిష్కరించడం ఎంతో బాధాకరమన్నారు. కూటమి ప్రభుత్వం వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు రామాంజులు, జయరామచంద్రయ్య, రమేశ్, మల్లికార్జున, నాగరాజ, శివనందన్, చంద్రయ్య, నరేశ్, లోకనాథం, సురేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ పోటీ విజేత అన్నమయ్య జిల్లా



చాంపియన్ షిప్ సాధించిన క్రీడాకారులు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27ఆంధ్రజ్యోతి): స్థానిక వశిష్టస్కూల్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న 8వ రాష్ట్ర అంతర్ జిల్లా సబ్ జూనియర్ షూటింగ్‌బాల్ పోటీల్లో బాలుర, బాలిక్ల విభాగంలో అన్నమయ్య జిల్లా జట్లు ప్రథమ స్థానంలో నిలవగా, స్థానిక ఎమ్మెల్యే షాజహాన్‌బాషా బహుమతులు అందించారు. బాలుర విభాగంలో అన్నమయ్య జిల్లా ప్రథమ , ఏలూరు ద్వితీయ, చిత్తూరు జిల్లా తృతీయ, సత్యసాయి జిల్లా నాల్గో స్థానంలో నిలువగా, బాలికల విభాగంలో అన్నమయ్య జిల్లా ప్రథమ, చిత్తూరు జిల్లా ద్వితీయ, తిరుపతి జిల్లా తృతీయ, కర్నూలు జిల్లా నాలో స్థానంలో నిలిచాయని నిర్వాహకుడు నరేష్‌బాబు తెలిపారు. వశిష్ట స్కూల్ చైర్మన్ పివిఆర్‌గుప్తా మాట్లాడుతూ రాబోవు కాలంలో మరెన్నో రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించేలా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. నేపాల్‌లో నిర్వహించిన రెండవ ఏషియన్ షూటింగ్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన మదనపల్లెకు చెందిన మహమ్మద్ యూసఫ్ బాషాను ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు అభినందించారు. అన్ని జిల్లాల నుంచి ప్రతిభ కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఏపీ షూటింగ్‌బాల్ అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి పరశురాముడు తెలిపారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షుడు గోల్డెన్‌వ్యాలీ రమణారెడ్డి, వశిష్టా స్కూల్ యాజమాన్యం ట్రస్టీ యశ్వంత్, రమణారెడ్డి, అనిల్ డెంటల్ ఆస్పత్రి డాక్టర్ అనిల్, తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యం అత్యవసరం: ఇస్కఫ్

మదనపల్లె, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): కశ్మీర్ లోని పహల్‌గాంలో పర్యాటకులపై ఉగ్ర దాడిని ఇస్కఫ్ తీవ్రంగా ఖండించింది. మదనపల్లెలో రెండో రోజులుగా నిర్వహి స్తున్న ఇస్కఫ్ 20వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ఇస్కఫ్ రాష్ట్ర అధ్యక్షుడిగా కాగితాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శులుగా ఎస్.నరసింహులు, తుంగ శ్రీధర్‌రావు, ఉప ప్రధాన కార్యదర్శిగా ఎం.మాధవరావు, ప్రచార కార్యదర్శిగా జి.వి. శివకుమార్, కార్యవర్గ సభ్యుడుగా టి.ఎస్. సుకుమారన్, ఆచార్య వి.బాలమోహన్‌దాస్, బొల్లిముంద కృష్ణ ఎన్నికయ్యారు. అనంతరం అధ్యక్షుడు మాట్లాడుతూ ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రజలంతా మత సామరస్యం పాటించాలని పిలుపునిచ్చారు.

ఇరువర్గాల ఘర్షణ :ఆరుగురిపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): భూమి విషయంలో ఇరువర్గాలు ఆదివారం ఘర్షణ పడ్డాయి. సీఐ కళా వెంకటరమణ తెలిపిన వివరాల మేరకు మండలంలోని చీకల బైలు గ్రామం, బార్లపల్లె వద్ద ఉన్న తన భూమిని తప్పుడు రికార్డులు చూపిస్తూ మైనార్టీ వర్గానికి చెందిన కొందరు దౌర్జన్యం చేస్తున్నారని, నాలుగు రోజుల క్రితం ఆ భూమిలో సిమెంటు పలకలతో కంచె ఏర్పాటు పనులు ప్రారంభించారని జ్యోతి అనే మహిళ చెబు తుండగా, ఆమె వద్దే రికార్డులు లేవని మరో వర్గం వారు చెబుతున్నారు. ఆదివారం జ్యోతి వర్గీయులు సిమెంట్ పలకలను ధ్వంసం చేయడానికి ప్రయత్నించగా మైనార్టీలు అడ్డుకోవడంతో ఘర్షణ చోటు చేసుకుంది. ఇరువర్గాల్లో నలుగురికి గాయాలయ్యాయి. నిఖిలేష్ వర్గంలో ముగ్గురిపై, మస్తాన్ వర్గంలో ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు తాలుకా సీఐ తెలిపారు.

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ తప్పనిసరి



హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ చేయిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): హజ్ యాత్రకు వెళ్లేవారు తప్పనిసరిగా వ్యాక్సినేషన్ చేయించుకోవాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. ఆదివారం బెంగళూరు రోడ్డులోని ఈద్గా వద్ద రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మదనపల్లెలో 107 మంది హజ్ యాత్రికులకు వాక్సినేషన్ చేయిస్తున్నామన్నారు. అనంతరం వారికి సర్టిఫికేట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో ఉషశ్రీ, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్, వ్యాక్సినేషన్ అధికారి శ్రీధర్, వైద్యులు ఫర్హాన్‌ఖాన్, సల్మాన్‌ఖాన్, భార్గవి , వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దచెరువు మృతులకు నివాళులు: ములకలచెరువు మండలం పెద్దచెరువులో మృతి చెందిన నలుగురికి ఎమ్మెల్యే నివాళులర్పించారు. స్థానిక ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తీసుకొచ్చిన మృతదేహాలను పరిశీలించారు. వారి అంతిమ సంస్కారాలకు తనవంతు ఆర్థిక సాయం అందజేశారు. ఆయన వెంట తంబళ్లపల్లె టీడీపీ నేత కట్టా దొరస్వామినాయుడు వున్నారు.

అత్యధిక అడ్మిషన్లు నమోదు చేయిస్తే బహుమతులు

పీలేరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): మానవతా సంస్థ ఆధ్వర్యంలో చేపట్టే సేవా కార్యక్రమాలు భేషుగ్గా ఉన్నాయని ఆ సంస్థ చైర్మన్ డాక్టర్ వంగిమళ్ల రామచంద్ర అన్నారు. ఆదివారం పీలేరు ఆర్యవైశ్య కల్యాణ మండపంలో శెట్టిసుబ్రమణ్యం అధ్యక్షతన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఏడాది కెరీర్ గైడెన్స్, నైతిక విలువలపై సెమినార్లు, బీదలకు దుప్పట్లు, స్వెటర్లు అందజేశామన్నారు. అన్నదానం, పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్స్ ఇచ్చామని తెలిపారు. ఈ ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అత్యధిక అడ్మిషన్లు నమోదు చేసే పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రోత్సాహక బహుమతులు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పేద విద్యార్థులకు అండగా నిలవాలని పలువురు సభ్యులు కోరారు. ఈ సమావేశంలో కో చైర్మన్ కృష్ణమూర్తి, కన్వీనర్ వై.వీ. రమణ, కోశాధికారి ఎం. జగన్‌మోహన్, సభ్యులు పెంజూరి అశోక్, ఎం. నాగరాజు, జీ.వీ. రమణ, పోతంశెట్టి రమేష్, అక్రమబాష, గఫార్ సాహెబ్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు త్వరలో ఇళ్లపట్టాలు

పీలేరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాల కోసం ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న ఆర్టీసీ కార్మికులకు పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్ రెడ్డితో సంప్రదించి వీలైనంత త్వరగా ఇప్పిస్తామని పీలేరు ఆర్టీసీ డిపో ఈయూ, ఎన్‌ఎంయూ గౌరవాధ్యక్షులు కోటపల్లె శ్రీనాథరెడ్డి, ఎల్లెల రెడ్డెప్పరెడ్డి తెలిపారు. ఈ నెల 23వ తేదీ బుదవారం ‘పుష్కర కాలంగా ఎదురుచూపు’ శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి వారు స్పందించారు. కార్మికులు రూ. 1.21 కోట్లు వెచ్చించి పీలేరు మండలం ఎర్రగుంటపల్లె పంచాయతీ పరిధిలోని నెట్టిబండ వద్ద పలువురు రైతుల నుంచి 15.77 ఎకరాల డీకేటీ భూమి కొన్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అక్కడ పట్టాలు ఇప్పిస్తామన్నారు. దీంతో ఆర్టీసీ కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఉచిత కరాటే శిక్షణ

పీలేరు రూరల్, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల ఒకటవ తేదీ నుంచి 3 వరకు ఉచిత కరాటే శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కరాటే మాస్టర్ జి. ఇనాముల్ హక్ తెలిపారు. ఆదివారం పీలేరులో యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ పీలేరు బ్రాంచ్‌లో బెల్ట్ టెస్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వామప్స్, బేసిక్స్, సెల్ఫ్ డిఫెన్స్, టెక్నిక్స్ నేర్పిస్తామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం పీలేరు పభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా ఉన్న యోధా మార్షల్ ఆర్ట్స్ అకాడమీలో సంప్రదించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో కరాటే మాస్టర్ సతీష్ పాల్గొన్నారు.

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోండి

కలకడ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి):విద్యాహక్కు చట్టం ప్రకారం మండలంలోని ప్రైవేట్ పాఠశాలల్లో 1వ తరగతిలో ఉచిత సీట్లకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో మునీంద్రనాయక్ కోరారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల్లో 25శాతం సీట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆరేళ్ల పైబడ్డ అనాథ, హెచ్‌ఐవీ బాధిత కుటుంబాల పిల్లలు, ఎస్సీ, ఎస్టీ, బలహీనవర్గాలకు చెందిన బీసీ, మైనారిటీ, ఓసీలు(వార్షిక ఆదాయం రూ.1.20 లక్షలోపు)వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఈ నెల 28 నుంచి మే 15లోగా ఆన్‌లైన్ ద్వారా సమర్పించాలన్నారు.

క్రికెట్‌లో జాతీయ స్థాయి గుర్తింపు సాధించాలి



క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందజేస్తున్న సీఐ ప్రసాద్‌బాబు

వాల్మీకిపురం, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): పట్టుదలతో కృషి చేసి క్రికెట్‌లో జాతీయ స్థాయి గుర్తింపు సాధించాలని వాల్మీకిపురం సీఐ ప్రసాద్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక మర్రిపాడు రోడ్డులోని జీవీఎస్‌సీఎస్ క్రీడా మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్, ఏసీఏ ఆధ్వర్యంలో వారం రోజులుగా టీ 20 క్రికెట్ లీగ్ పోటీలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీఐ ప్రసాద్‌బాబు, స్పెషల్ బ్రాంచ్ సీఐ, వీసీసీ సభ్యులు రాజారమేష్, ఎస్‌ఐ చంద్రశేఖర్‌లు హాజరయ్యారు. ఆదివారం జరిగిన పోటీలో సీడీసీఏ టైగర్స్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 20 ఓవర్లలో 124 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్ చేసిన సీడీసీఏ బైసన్స్ జట్టు 17.2 ఓవర్లలో 102పరుగులకు ఆలౌటైంది. 22 పరుగుల తేడాతో టైగర్ జట్టు గెలుపొందగా ఆ జట్టులోని దీవన్‌సాయి అనే క్రీడాకారుడికి మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ లభించింది. అనంతరం బహుమతులు ప్రదానం చేసి క్రీడాకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ నాయకుడు విష్ణుచైతన్య, జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, జిల్లా క్రికెట్ కోచ్ సునీల్ కుమార్, వీసీసీ సభ్యులు భరత్, ఉదయ్, షాహెద్, రామకృష్ణ, ఆర్‌ఎం.ముజీద్, తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మల్లికార్జున నాయుడు, గిరిధర్‌రెడ్డి

మదనపల్లె అర్బన్, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): ములకలచెరువు సమీపంలోని పాత ములకల చెరువు పెద్ద చెరువులో మునిగి మృతి చెందిన వారి కుటుంబాలను ఆదివారం పలువురు పరామర్శించారు. జిల్లా ఆస్పత్రిలో ఉన్న మల్లేష్, లావణ్య, నందకిషోర్, మరో బాలిక మృతదేహాలను మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా సందర్శించి బాధిత కుటుంబాలను ఓదార్చారు. తంబళ్లపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సూచనల మేరకు తంబళ్లపల్లె నియోజకర్గ ప్రచార సమన్వయకర్త సీడు మల్లికార్జుననాయుడు, పారిశ్రామికవేత, టీడీపీ నేత మంత్రి గిరిధర్‌రెడ్డి, బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, విశ్వనాథ రెడ్డి తదితరులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి పంపిన రూ.30వేలను అందజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాల అండగా ఉంటామని హామీ ఇచ్చారు. టీడీపీ యువనేత కట్టా దొరస్వామినాయుడు కూడా పరామర్శించి అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేలు అందజేశారు. మృతదేహాలను వారి స్వగ్రామాలకు తరలించేందుకు అంబులెన్స్ సౌకర్యం కల్పించారు.

నేటి నుంచి విద్యార్థులకు విజ్ఞాన శిబిరాలు

కలికిరి, ఏప్రిల్ 27 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గంథాలయంలో సోమవారం నుంచి విద్యార్థుల కోసం విజ్ఞాన శిబిరాల పేరుతో ప్రత్యేక వేసవి తరగతులను నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయాధికారి విజయకుమార్ తెలిపారు. జూన్ 6వ తేదీ వరకూ ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 11 గంటల వరకూ వివిధ రకాల తరగతులు, కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. విద్యార్థులో తెలుగు భాషాభివృద్ధిని పెంపొందించేందుకు కథలు, గాథలు, చదవడం, రాయడం, విలువలకు సంబంధించిన కార్యక్రమాలు, స్పోకెన్ ఇంగ్లిఖ, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, చెస్, జీకే, యోగా తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాలుంటాయన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే విద్యార్థులకు బోధించడం, ప్రసంగించడం వంటి వాటిపై ప్రతిభ కలిగి, ఆసక్తి కలిగి స్వచ్ఛందంగా తర్ఫీదు ఇవ్వవలసినదిగా ఆహ్వానించారు. గ్రంథాలయాధికారి ఫోను నెంబరు 7780169780 ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకుని పేర్లు నమోదు చేసుకోవలసిందిగా విజయకుమార్ తెలిపారు. విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు కూడా పాల్గొనాలని కోరారు.

వేటగాళ్లను పట్టుకొన్నారు...వదిలేశారు...!

గుర్రంకొండ, ఏప్రిల్ 27(ఆంధ్రజ్యోతి): అడవి పందులను కరెంట్ ఉచ్చుతో చంపుతున్న వేటగాళ్లను అటవీశాఖ అధికారులు వారం రోజుల కిందట పట్టుకొని వదిలేసిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కలకడ మండలం ఎనుగొండపాలెం పంచాయితీ కుమ్మరపల్లెకు చెందిన ఓ వేటగాడు కరెంట్ ఉచ్చువేసి అడవి పందులను చంపుతున్నాడు. వాటిని తరిగొండ, వాల్మీకిపురం, మదనపల్లె ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకొంటున్నాడు. ఈ నేపథ్యంలో వారం రోజుల ఓ అడవి పందిని తరిగొండకు చెందిన ఓ వ్యక్తి విక్రయించడంతో గ్రామస్థులు అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారు మాంసం అమ్ముతున్న వ్యక్తితోపాటు మరో ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారు వినియోగిస్తున్న ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేశారు. అనంతరం కొన్ని గంటల వ్యవధిలోనే వారిని ఇళ్లకు పంపేశారు. ఈ విషయమై మర్రిపాడు సెక్షన్ బీట్ అధికారి వరదారెడ్డిని వివరణ కోరగా వేటగాళ్లను పట్టుకున్న మాట వాస్తవమేనన్నారు. వారిపై కేసు నమోదు చేసి ఫైన్ విధించినట్లు తెలి పారు. మరోసారి వన్యప్రాణులను వేటాడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్లు ఆయన తెలిపారు.